Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 26.05.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 51 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## హ్యాట్రిక్

- జిల్లా తెదేపా అధ్యక్షుడిగా మూడోసారి బీదకే ఛాన్స్
- పనిచేసిన బీసీ కార్డు



**జిల్లా తెలుగుదేశం పార్టీలో కీలక నాయకుడిగా ముఖ్యంగా బీసీ వర్గాల నుండి పెద్ద నాయకుడిగా వున్న బీద రవిచంద్రకే మూడోసారి తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు.**

(మిగతా 11వ పేజీలో)

- ✔ పరిణితి చెందిన ప్రవర్తన
- ✔ సీనియర్లకు ప్రాధాన్యం
- ✔ వ్యూహాలతో ఢిల్లీ రాజకీయాల్లో మలుపులు
- ✔ సమయానుగుణంగా ఎత్తుగడలు
- ✔ పార్టీ కేడర్‌లో వెల్లివిరుస్తున్న ఆనందం

## గాడిలో పడ్డ జగన్



***కత్తి మొనతేలేదైనా, వజ్రం మెరిసేదైనా మెరుగుపడితేనే! తల్లి గర్భంలోనే అన్నీ నేర్చుకోవడానికి అందరూ అభిమన్యులు కాదు, అందరికీ శ్రీకృష్ణుడు లాంటి మేనమామలు ఉండరు. ప్రతి వ్యక్తికి కూడా అనుభవమే జీవితసారాన్ని బోధిస్తుంది. భవిష్యత్ మార్గాన్ని సూచిస్తుంది. ఏ రంగంలోనైనా ముందు కష్టపడడం, ఆ తర్వాత ఫలితాన్ని ఆశించడం అన్నది ప్రాథమిక సూత్రం కావాలి.***

ముఖ్యంగా రాజకీయాల్లో కష్టపడకుండా పదవులు పొందేవాళ్ళు నాయకులు కాదు. కష్టపడకుండానే సీఎం కుర్చీ దక్కడానికి అందరు నాయకులకూ ఎన్టీఆర్ లాంటి మామలు దొరకరు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం కాకుండా వైసిపియే అధికారంలోకి వచ్చుంటే పరిస్థితి ఏంటి? ఆ గెలుపు వై.యస్‌దేగాని జగన్‌ది కాదు. ఎందుకంటే అప్పటికి జగన్ రాజకీయాలలో ఎల్‌కెజి మాత్రమే చదువుతున్నాడు. వై.యస్. బొమ్మను చూసి, ఆయన చేసిన మంచి పనులను చూసే ప్రజలు ఓట్లేసారనే పేరుండేది. తండ్రి పేరు చెప్పుకుని సీఎం కుర్చీ ఎక్కాడన్న పేరు జగన్‌కు జీవితాంతం ఉండిపోయేది. అదీగాక అప్పుడే అధికారంలోకి వచ్చుంటే తాను చేసిందే రైట్ అనుకునే మూర్ఖత్వం స్థాయి అతనిలో ఇంకొంచెం పెరిగివుండేది. తెలిసీ తెలియని తప్పులు చేసి రాజకీయాల్లో గబ్బు పట్టుండేవాడు.

రాజశేఖరరెడ్డి కూడా 30ఏళ్లు నిత్యం పోరాడబట్టే ముఖ్యమంత్రి అయ్యాక ప్రజల నాడినిబట్టి పని చేయగలిగాడు. ప్రజల మనసుల్లో నిలిచిపోయేలా పరిపాలన చేసాడు. జగన్‌కు 2014లో ప్రతిపక్ష నేతగా అలాంటి అపూర్వ అవకాశమే వచ్చింది. 2014లో ముఖ్యమంత్రి కుర్చీ కంటే ప్రతిపక్ష నేత బాధ్యత రావడమే ఆయన రాజకీయ జీవితంలో మేలిమలుపు. ఈ మూడేళ్లలో ప్రతిపక్ష నేతగా సమర్ధవంతంగా రాణించగలిగాడు. ప్రభుత్వ అవినీతి అక్రమాలను అసెంబ్లీ లోపల, బయటా ఎండగట్టడంలో విజయం సాధించాడు. రాష్ట్రంలో ఓ పక్క ఎల్లో మీడియాను, ఇంకోపక్క ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ధీటుగా ఎదుర్కొంటూనే ఇంకోపక్క తన పార్టీ కేడర్‌లో ధైర్యం నింపుతున్నాడు. 2014 ఎన్నికలలో తాను చేసిన పొరపాట్లను పునఃసమీక్షించుకుంటూ, వాటిని పురావృతం కానీయడం లేదు. వైసిపిలోకి వస్తామంటున్న కాంగ్రెస్ సీనియర్లను ఆహ్వానిస్తున్నాడు. సీనియార్టీని బట్టి ప్రాధాన్యతినిస్తున్నాడు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నేతలతో నేరుగా సంప్రదింపులు జరుపుతున్నాడు. అందరితో మంచి, చెడ్డా పార్టీ పరిస్థితులపై చర్చిస్తున్నాడు. గతానికంటే భిన్నంగా తమకు దగ్గరగా వ్యవహరిస్తున్న జగన్‌ను చూసి ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆనందిస్తున్నారు. వచ్చే

(మిగతా 11వ పేజీలో)

## బీజేపీలో అమితోత్సాహం!

- ➤ రాష్ట్ర కేడర్‌లో కదలిక
- ➤ సొంత జెండా, ఎజెండాపై ఆశలు



**రాష్ట్ర రాజకీయాలలో కొత్త మలుపులు చోటు చేసుకోబోతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలోనూ బీజేపీ జెండా ఎగరాలన్న మోడీ, అమిత్‌షా ద్వయం ఆకాంక్షకు ఆంధ్రప్రదేశ్ టార్గెట్‌గా మారింది. 25వ తేదీ విజయవాడలో జరిగిన బీజేపీ బహిరంగ సభలో పాల్గొన్న ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఆ దిశగా సంకేతాలు వదిలారు.**

దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ బీజేపీని అధికారంలోకి తేవాలన్న సంకల్పంతో మోడీ, అమిత్‌షాలు ఒక వ్యూహం ప్రకారం పని చేసుకుపోతుండడం తెలిసిందే! అయితే ఈశాన్య రాష్ట్రాలలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుంటే, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 35ఏళ్ల నుండి పోరాటం చేస్తున్నా పార్టీ పరిస్థితి నానాటికీ దిగజారుతుందేగాని మెరుగుపడిన దాఖలాలు లేవు. దీనికి కారణాలను ఆ పార్టీ అధిష్టానం విశ్లేషించింది. రాష్ట్రంలో తెలుగుదేశాన్ని బ్రతికించడానికి, ఆ పార్టీ అధినేత రాజకీయ భవిష్యత్‌కు తమ భవిష్యత్‌ను బలిచేసుకున్నామని బీజేపీ

(మిగతా 11వ పేజీలో)

## రాష్ట్రంలో... రాజ్యమేలుతున్న రాక్షసత్వం!



- ➤ పెరిగిపోతున్న హత్యలు, అరాచకాలు
- ➤ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో దాడులు
- ➤ ప్రతిజిల్లాలోనూ పోలీసు వ్యవస్థ నిర్వీర్యం
- ➤ ప్రశాంతంగా పనిచేసుకోలేకపోతున్న అధికారులు
- ➤ అశాంత వాతావరణంలో గ్రామాలు

***ఇటీవల మనం తెలుగులో ఎన్నో ఫ్యాక్షన్ సినిమాలను చూసాం. కక్ష్యలు, కార్పణ్యాలను రాజేసే సినిమా కథలు కొన్నయితే, ఆ కక్షలకు ఎలా ముగింపు చెప్పాలో సందేశాత్మకంగా వివరించే సినిమా కథనాలు మరికొన్ని! ఒక ఫ్యాక్షనిస్ట్‌ను ఇంకో ఫ్యాక్షనిస్టు హత్య చేయించడం... హత్యకు గురైన ఫ్యాక్షనిస్ట్ కుటుంబసభ్యులు ప్రత్యర్థి కుటుంబాలపై పగపెంచుకోవడం, అవకాశం చిక్కినప్పుడు దారికాచి హత్య చేయడం. ఈ తరహా విధానం పగలను, ప్రతీకారాలను పెంచుకుంటూపోతుందేగాని, ఫ్యాక్షన్‌ను అంతం చేయదు.***

దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఫ్యాక్షన్‌కు సరికొత్త కోణంలో ముగింపు పలికాడు. చాలా నియోజకవర్గాల్లో పగలతో రగిలిపోతున్న ఫ్యాక్షన్ నాయకులను ఏ పార్టీ వారైనా పిలిపించేవాడు. ఇద్దరి మధ్య రాజీ చేసేవాడు. ఒకరు రాజకీయాలు చూసుకుంటే ఇంకొకరు వ్యాపారాలు చేసుకునేలా ఒప్పందాలు చేసాడు. దీంతో ఎవరి పాటికి వాళ్ళు ప్రశాంతంగా బ్రతకడమే కాక, వాళ్ళ అనుచరులు కూడా సాధారణ జీవనంలోకి రాగలిగారు. కత్తులు వదిలేసి భార్యా బిడ్డలతో శుభ్రంగా కాపురాలు చేసుకున్నారు. వై.యస్. హయాంలో చాలామంది నాయకులు ఫ్యాక్షనిజాన్ని వదిలేసి జీవితంలో వుండే నిజమైన ఆనందాన్ని చవిచూడగలిగారు. కాని, ఇప్పుడు చంద్రబాబు పాలనలో

(మిగతా 11వ పేజీలో)

# నిప్పులు కురిపిస్తున్న ఎండలు

## ● పిట్టల్లా రాలుతున్న జనం... ఉక్కపోతతో అతలాకుతలం...

అసలే ఎండా కాలం..మే నెల అంటేనే మండే నెల. ఈ నెలలో ఎండలు కాదు.. నిప్పులు కురుస్తుంటాయి. అందులోనూ రోహిణి కార్తె, రోహిణిలో రోళ్ళు పగిలి పోతాయని సామెత. అంటే, ఎండదెబ్బ ఎంత తీవ్రంగా వుంటుందో అర్ధమవుతుంది. మే ప్రారంభం నుంచి జిల్లాలో రోజురోజుకు ఎండలు మరింతగా పెరిగి పోతూనే వున్నాయి. ఒకప్పట్లో 30 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతకే హడలిపోయే నెల్లూరు జనం, ఇప్పుడు 45 నుంచి 48 దాకా ఎండ తీవ్రత పెరిగిపోతుండడం చూసి బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 7.30 నుంచి సాయంత్రం దాకా ఎండల భగభగ..రాత్రి 8 గంటల దాకా ఒకటే సెగ. పగలంతా మండే ఎండ..రాత్రయితే ఉక్కపోత.. జనం అల్లాడి చస్తున్నారు. వేడిగాలుల ధాటికి వడలిపోయి.. ఎంతో మంది ముసలీముతకా జనం వడదెబ్బతో హరీమంటున్నారు. బతుకు తెరువు కోసం తప్పనిసరై ఇంత ఎండల్లోనూ ఇళ్ళలోంచి బయటకు వచ్చి పనులు చేసుకునే కూలీలు, శ్రమజీవుల పరిస్థితి మరింత దయనీయంగా వుంటోంది. నీడ పట్టున వున్నప్పటికీ ముసలిప్రాణులు ఎండ దెబ్బకు తట్టుకోలేక ప్రాణాలు విడుస్తున్నారు. మరీ ఇంత ఎండలు నెల్లూరులో ఇటీవలి కాలంలో ఎప్పుడూ చూడలేదు. రోడ్లపక్కల చెట్లన్నీ ఇష్టమొచ్చినట్లు నరికిపారేయడం, అడవుల్ని నరికేయడం, సామాజిక వనాల్ని విస్తరించుకోలేకపోవడం..వంటివన్నీ మనం చేసుకుంటున్న తప్పిదాలే. అంతెందుకు, ఇంత పెద్ద నగరంలో ప్రధాన రోడ్ల పక్కన కనీసం నిల్చోడానికి నీడ కూడా లేకుండా చెట్లన్నిటినీ నాశనం చేసేయడం.. అసలు పచ్చదనమన్నది కనిపించకుండా పోవడం.. ఇదంతా మనం చేజేతులా తెచ్చుకుంటున్న అవస్తే అన్నది అందరికీ తెలిసిందే. దీంతో పర్యావరణం పరిస్థితి అంతా తారుమారైపోతోంది. పర్యావరణం కాపాడుకుందాం.. మొక్కలు పెంచుకుందాం అంటూ చేసే నినాదాలు కేవలం కంటి తుడుపు కోసమేనా?.. వందల సంవత్సరాల నాటి వృక్షాలను కూలగొట్టేసి చిన్ని చిన్ని మొక్కలు నాటుకున్నందువల్ల ప్రయోజనం ఎప్పటికి చేకూరుతుంది?.. మొక్కలు నాటుకోవడం అన్నది పర్యావరణానికి ప్రాణప్రదమైన విషయమన్నది ఎవరూ కాదనలేని సత్యం. అది అందరి కర్తవ్యం కూడా. అయితే, మొక్కలు



సింహపురి సమాచారం

నాటడం పేరుతో అందినకాడికి నిధులను స్వాహా చేసేసి, నాటిన మొక్కలకి కనీసం దోసెడు నీళ్ళు కూడా పోయకుండా వాటిని ఎండబెట్టేయడం మనం చూస్తూనే వున్నాం. జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల ఇదే దుస్థితి. కేవలం నామమాత్రపు పథకాలు..ఊకదంపుడు ఉపన్యాసాలు పర్యావరణాన్ని మార్చగలవా?..మానవుడి ఈ అరాచక ప్రవృత్తికి పర్యావరణమే తారుమారైపోతోంది. ఇంక ప్రకృతిని నిందించి ఏం ప్రయోజనం?..

**ఒకప్పుడు ముక్కారు పండే నేల.. ఇప్పుడు ఎడారి?..**

గతంలో నెల్లూరుసీమలో ప్రతి ఏటా పుష్కలంగా వానలు కురిసి ముక్కారు (ఏడాదికి మూరు కార్లు) పంటలు పండేవి. రాష్ట్రంలోనే మంచి పంటభూములున్న ప్రాంతంగా నెల్లూరు ప్రసిద్ధి. ముక్కారు పంటలకు, రుచికరమైన ధాన్యానికి కోశాగారం వంటి సింహపురి సీమ ఇప్పుడు రానురాను ఎడారిగా మారుతోంది. పచ్చగా కళకళలాడే పంటపొలాలన్నీ ఇటీవలి కాలంలో రూపుమారిపోతున్నాయి. మరోవైపు వేలాది ఎకరాలు పంట భూములు వానలు లేక బీడుభూములుగానే మిగిలిపోతున్నాయి. జిల్లాలోనే అనేక గ్రామాల్లో, మారుమూల పల్లెల్లో తాగేందుకు చుక్క మంచినీరు దొరక్క జనం విలవిలలాడిపోతున్నారు. మూగజీవాలకు పిడికెడు గడ్డి, గుక్కెడు నీరు దొరక్క అవి పడే బాధలకు అంతే లేదు. చివరికి అడవుల్లోనూ నీళ్ళు లేక, ఊర్లమీదకు వస్తున్న మూగజీవాలను కుక్కలు వెంటాడి చంపే పరిస్థితి. జిల్లాలో అనేక మండలాలు కరువుతో వున్నా పట్టించుకునే దిక్కు లేదు. ఎంత దయనీయమైన స్థితి వున్నా ప్రభుత్వం నిర్లిప్త ధోరణితో వుండబట్టే వడదెబ్బకు పోయేవాళ్ళు పోతూనే వున్నారు. మండే ఎండల్లో జనం అవస్తలు పడుతూనే వున్నారు.

**వడదెబ్బకు పిట్టల్లా రాలుతున్న జనం**

జిల్లాలో గత పదిరోజులుగా ఎండలు మరీ విపరీతమైపోయాయి. మండే సూర్యుడి భగభగలతో ప్రాణాలు అవిసిపోతున్నాయి. ఎండల తీవ్రత 44 డిగ్రీలు దాటుతుంటే ముసలి ప్రాణాలు బతికి బట్టకట్టడమంటే మాటలా?..గత వారం పదిరోజుల్లోనే ఈ వడదెబ్బకు దాదాపు వందమందికి పైగానే ప్రాణాలు కోల్పోయి వుంటారని ఒక అంచనా. అయితే, వీటిని నిర్ధారించి బాధిత కుటుంబాలకు తగు సాయం చేయడానికి ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదు. ప్రకృతి విపత్తులకు మృతి చెందినవారి కుటుంబాలను ఆదుకోకపోవడం ఎంత దారుణం?...కాకి అరుస్తూనే వుంటుంది..కరవాడ ఎండుతూనే వుంటుందన్న సామెతగా ఎవరెంతగా మొత్తుకుంటున్నా తమ బాధలు ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజల ఆవేదన. ఇకనైనా ప్రభుత్వం, జిల్లా అధికారగణం మానవతా హృదయంతోనైనా స్పందించి, వడదెబ్బ మృతుల కుటుంబాలను ఆదుకోవాల్సి వుంది. గ్రామాల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపట్టాల్సి వుంది.

## జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి



జర్నలిస్టులు ఎండాకాలంలో వృత్తిమీద శ్రద్ధతో పాటు ఆరోగ్యం పట్ల కూడా జాగ్రత్త వహించాలని ఎపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్ అన్నారు. ఈ నెల 22వ తేదీన నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో యూనియన్ ఆఫ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్నారని, వారి వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ప్రస్తుతం నెల్లూర్లో ఎండ తీవ్రత ఎక్కువుగా ఉన్న దృష్ట్యా యుఇజె తరఫున పాదచారులకు, ఆటోడ్రైవర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నగర డిఎస్పీ జి.వెంకటరాముడు మాట్లాడుతూ వేసవిలో ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానిక పత్రికల యూనియన్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంచడం సమాజం పట్ల వారికున్న బాధ్యతను తెలియజేస్తుందన్నారు. జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు

గూడూరు పట్టణంలో అప్రకటిత విద్యుత్తు కోతలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గూడూరు పట్టణంలో విద్యుత్ అంతరాయంతో సోమవారం వేకువ జామున ఒంటిగంట సమయం నుండి రెండు గంటల పాటు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. పగలు కాస్తున్న ఎండవేడిమికి తట్టుకోలేక ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు పడుతున్న అవస్తలు దయనీయంగా ఉన్నాయి. రాత్రిళ్లు విద్యుత్ కోతతో అన్ని వర్గాల ప్రజలు తిప్పలు పడాల్సి వచ్చింది. డిస్కం అధికారులు విద్యుత్‌కోతలను లేకుండా సవ్యంగా సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. సాంకేతిక సమస్య కారణంగా పట్టణంలో విద్యుత్ అంతరాయం కలిగినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

## టిడిపి అక్రమాలకు అడ్డే లేదా?

**- ఎమ్మెల్యే కిలివేటి**



జిల్లాలో టిడిపి నాయకుల అక్రమాలకు అడ్డే లేకుండా పోతోందని, వీటిని అడ్డుకోకుంటే ఉద్యమం తప్పదని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం ఆయన నాయుడుపేటలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శీనానాయక్‌ను కలసి నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో టిడిపి నాయకులు ఇసుక దోపిడీకి అడ్డూ అదుపు వుండడం లేదని వివరించారు. ఇసుక, మట్టి అక్రమరవాణా మితిమీరిపోతోందని, చెరువుల్లోని లక్షలాది టన్నుల మట్టిని దోచుకుంటున్నారని, గ్రామస్తులెవరైనా అడ్డుపడితే వారిపై టిడిపి నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారని, గ్రామస్తులను అక్రమంగా కేసుల్లో ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆర్డీఓకు తెలిపారు. అసలు, అక్రమరవాణా జరుగకుండా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సిసి కెమెరాలు ఎందుకు పనిచేయడం లేదో ఉన్నతాధికారులు పరిశీలించాలన్నారు. లారీల్లో ఇసుకను నింపుకుని, దానిపై సిలికాను వేసి బిల్లులు చూపి యధేచ్ఛగా ఇసుకను తరలించుకుపోతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వుంటున్నారని ఆయన విమర్శించారు. నెల్లూరు నుంచి చెన్నై, బెంగుళూరు ప్రాంతాలకు సిలికా మాటున ఇసుక తరలిపోతున్నా పట్టించుకునేవారు లేరన్నారు. అంతేకాక, టిడిపి నాయకులు వైఎస్సార్సీపి నాయకులపై, కార్యకర్తలపై చీటికీమాటికీ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

## డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బదిలీ

ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడులో వున్న డైట్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ విజయలక్ష్మి బదిలీ అయ్యారు. విజయవాడలోని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్ సెంటర్‌కు ఆమె బదిలీ జరిగింది. ఆ స్థానంలో సీనియర్ అధ్యాపకుడు బాలాజీరావు నియమితులయ్యారు.

## ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య పోటీలు



కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నెల్లూరు నర్తకి సెంటర్‌లోని శ్రీ గురుకృప కళాక్షేత్రంలో శాస్త్రీయ నృత్య పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళలను ప్రోత్సహించండి అనే అంశంపై సభా కార్యక్రమం జరిగింది. సభాధ్యక్షులుగా సురభి గాయత్రి వ్యవహరించగా ముఖ్యఅతిథులుగా ఇంజనీరు శ్రీనివాసరావు, అప్పజోడు సుబ్బారావు, శ్రీను పాల్గొన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ట్రస్టు అధ్యక్షుడు కేతా సుబ్బారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

Veda Vyāsa వేదవ్యాస School
( Recognised by the Govt.of A.P )
Magunta Lay-out
Ph : 2302228
9849281870
SSC 2017 లో 10/10 GPA తో STATE TOP
10/10 GPA 10/10 GPA 10/10 GPA 10/10 GPA
48 మంది విద్యార్థులలో A1,A2 Grades 43
IIT / NEET Foundation
ADMISSIONS ARE IN PROGRESS
29 Years of Excellence
A.P. Balaji Correspondent



# ఒక్క నెలలో సర్వీసురోడ్డు పూర్తి

**- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

నెల్లూరురూరల్ బుజబుజనెల్లూరు సర్వీస్‌రోడ్డు పనులు ఒక్క నెలలో పూర్తవుతాయని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుజబుజనెల్లూరు సర్వీసురోడ్డు పనులు ఇటీవల ప్రారంభమైన నేపథ్యంలో నేషనల్ హైవే అధికారులతో కలిసి బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బుజబుజనెల్లూరులో 300 మీటర్ల రోడ్డు లేక హైవే మొదలైనప్పటి నుంచి స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అనేకమంది మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేసారు. ఆరునెలలుగా అనేక పోరాటాలు చేసి అధికారులు, ఢిల్లీ చుట్టూ తిరిగి హైవే అధికారులను కలిసినందుకు ఫలితం దక్కిందన్నారు. 20వేల జనాభాకు అవసరమైన రోడ్డు పనులు 30రోజుల్లో పూర్తి కానుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. సుందరయ్య కాలనీ, కనుపర్తిపాడు, సింహపురి హాస్పిటల్, ఎన్టీఆర్ నగర్ జంక్షన్ల వద్ద అండర్‌పాస్‌లను సాధించేందుకు పోరాటం చేస్తానన్నారు. తాటి వెంకటేశ్వర్లు, కిరణ్, ఖాదర్‌బాషా, పొద మేకల శ్రీహరి, వెంకట సుబ్బయ్య, మహమ్మద్, హరినాయుడు, కృష్ణారావు, మల్లిఖార్జున, రాజా, రాజేష్, మంజునాథ, వరదయ్య, సతీష్, ఇర్షాద్, సాయి, అమీర్‌జాన్, బాబు పాల్గొన్నారు.

# తెదేపా నాయకులు దద్దమ్మలు




నెల్లూరుజిల్లా దగదర్తి మండలం లోని దామవరంలో ఎయిర్‌పోర్టును రద్దు చేసి ఇతర జిల్లాలకు తరలిస్తామని పెట్టుబడుల శాఖ కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపినా తెలుగుదేశంపార్టీ జిల్లా నాయకులు మంత్రులు దద్దమ్మల్లా వ్యవహరిస్తున్నారని వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. 20వ తేదీ నెల్లూరు మాగుంట లే అవుట్‌లో వున్న వైయస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ దివంగత వై.యస్.రాజశేఖరరెడ్డి జిల్లాకు తీసుకువచ్చిన ఎయిర్‌పోర్టును చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రద్దు చేయడం దారుణమన్నారు. ఈ విషయంపై టిడిపి నాయకులు స్పందించి సిఎం చంద్రబాబును నిలదీయాలన్నారు. మొదటి నుంచి టిడిపి ప్రభుత్వం ఈ ఎయిర్‌పోర్ట్‌పై భిన్నంగా వ్యవహరిస్తోందని, మొదట 2,200ఎకరాలు అవసరమని, మరలా 600 ఎకరాలు సరిపోతాయని విరుద్ధమైన ప్రకటనలు చేస్తోందని, చివరకు రైతులకు నష్టపరిహారం కింద ఇవ్వాల్సిన రూ. 15కోట్లు ఇవ్వడం ఇష్టం లేక ఎయిర్‌పోర్టును రద్దు చేసారన్నారు. టెండర్లు ఖరారయిన తర్వాత రద్దు నిర్ణయం ఏమిటని ప్రశ్నించారు. ల్యాండ్ పూలింగ్ ఎక్స్‌పర్ట్ సిఎం చంద్రబాబుకు ముడుపులు అందకపోవడంతోనే ఎయిర్‌పోర్టును రద్దు చేసారని విమర్శించారు. చంద్రబాబు వీదేశీ ప్రయాణానికి అయ్యే విమాన ఖర్చులంత లేని రూ.15కోట్లు ఇవ్వడం ఇష్టం లేకనే ఎయిర్‌పోర్టు రద్దు చేశారన్నారు. జిల్లా అభివృద్ధిని అడ్డుకుంటున్న టిడిపి ప్రభుత్వంపై పోరాడేందుకు పార్టీలకతీతంగా కలసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైయస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి సుకుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బీద రమేష్, అల్లూరు మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, కావలి కౌన్సిలర్ తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ రాష్ట్ర డిప్లమో ఇంజనీర్ల సంఘం 40వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల విజయవాడ, జ్యోతి కన్వెన్షన్ హాలులో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అభివృద్ధి పనుల ఆల్బమ్‌ను ఆవిష్కరిస్తున్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్, ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ రామమూర్తి, ఆ సంఘ అధ్యక్షుడు షేక్ రియాజ్‌అహ్మద్, జేపీసీ చైర్మెన్ అశోక్‌బాబు తదితరులు

## పరిపూర్ణ ఆరోగ్యానికి...

# పన్నెండు సూత్రాలు

**- సీనియర్ జనరల్ వాస్క్యులర్ సర్జన్ డా॥ సిఎంకె రెడ్డి**





తమిళనాట తెలుగుప్రజల ఆప్తుడిగా, పేదల వైద్యుడిగా పేరొందిన వ్యక్తి డాక్టర్ చిల్లకూరు ముద్దుకృష్ణారెడ్డి. నెల్లూరీయులంటే ఎంతో అభిమానం చూపించే నెల్లూరీయుడు. ప్రజలకు వైద్య విధానాలు, అందుతున్న చికిత్సలపై ఎన్నో అపోహలున్నాయి. లక్షలు ఖర్చు పెట్టుకుని చేయించుకున్నదే వైద్యం, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉండే వారే వైద్యులు అన్నట్లుగా ప్రజల దృష్టి కోణం వుంటోంది. ప్రజలలో ప్రబలంగా వున్న ఈ అపోహలకు తెరదించుతూ ప్రతి మనిషి జీవితంలోనూ పరిపూర్ణ ఆరోగ్యానికి పన్నెండు ఆరోగ్య సూత్రాలను డాక్టర్ సిఎంకె రెడ్డి మనకు అందించారు. చెన్నై అపోలో ఆసుపత్రిలో జనరల్ వాస్క్యులర్ సర్జన్‌గా వైద్యసేవలందిస్తున్న ఈ వైద్యరత్నం ఈ నెల 21వ తేదీన నెల్లూరు, అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో వివిధ వైద్య, ఆరోగ్య సంబంధిత అంశాలపై జరిగిన సిఎంఇ సదస్సుకు హాజరైంది. ఈ సదస్సులో ఆయన అమూల్యమైన వైద్యసలహాలు, సూచనలు అందజేశారు.

రోగమొస్తే పేరున్న పెద్ద కార్పొరేట్ వైద్యసంస్థలను కాకుండా మొదట మంచి డాక్టర్ ఎక్కడ ఉంటే అక్కడే వైద్యం చేయించుకోవాలని, మంచి వైద్యం అందాలంటే ప్రతి ఒక్కరూ కొన్ని ఆరోగ్య సూత్రాలను పాటించాలని సూచించారు. ఆరోగ్యం సక్రమంగా లేకపోతే సొంత వైద్యం చేసుకోరాదని, ఫార్మాసిస్టు సిఫార్సు చేసిన మందులను వాడరాదన్నారు. అనర్హులైన వైద్యుల వద్దకు వెళ్లొద్దని, మొదట స్పెషలిస్టు వద్దకు కాకుండా ఫ్యామిలీ డాక్టర్లను సంప్రదించాలని కోరారు. రోగికి ఇష్టం లేకుండా ఎలాంటి పరీక్షలు చేయకూడదన్నారు. మెడికల్ రిపోర్టులను, డిశ్చార్జి సమ్మరీలను భద్రపరచుకోవాలన్నారు. అన్ని వివరాలు, ఆప్షన్లు తెలుసుకోవాలని, వైద్యచికిత్సకు అంగీకరించే ముందు మంచి చెడ్డలు గురించి తెలుసుకోవాలన్నారు. చికిత్సకు తగువైన వైద్యుడినే ఎంచుకోవాలని ఆస్పత్రిని ఎంచుకోవద్దన్నారు. మెడికల్ సైన్స్ హద్దులు గ్రహించాలని, అద్భుతాల కోసం ఆశించవద్దన్నారు. హక్కుల గురించి తెలుసుకుని బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. నయం చేయలేని జబ్బుల గురించి మోసగాళ్ళు ఇచ్చే ప్రకటనల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. మంచి ఆరోగ్యం కోసం నలుగురు డాక్టర్లను ఎప్పుడూ గుర్తుంచుకోవాలని డాక్టర్ సిఎంకె రెడ్డి చెప్పిన సలహాలు, సూచనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అందరినీ కూడా ఆలోచింపజేసాయి. ఈ సదస్సులో డాక్టర్లు సిఆర్‌రెడ్డి, సౌందర్‌రాజన్, పల్లంరెడ్డి యశోధర తదితరులు తమ విభాగాల్లో వైద్యం గురించి వివరించారు. అపోలో యూనిట్‌హెడ్ నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేతారెడ్డి, మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్ట్ దగదర్తిలోనే...

**- టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర**



వైయస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నట్లు నెల్లూరుజిల్లాకు మంజూరైన ఎయిర్‌పోర్ట్ ఎక్కడికీ పోదని, దగదర్తిలోనే ఏర్పాటవుతుందని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నాడు. అక్కడ భూసేకరణలో కొన్ని సమస్యలు ఏర్పడ్డాయని, త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని చెప్పాడు. సోమవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్ట్ భూసేకరణలో ముఖ్యమంత్రికి కమిషన్ దక్కకపోవడంతోనే తరలిస్తున్నారంటూ వైసిపి నాయకులు ఆరోపణలు చేస్తున్నారని, వారు నోరు అదుపులో పెట్టుకోకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వైయస్సార్ హయాంలో దగదర్తిలో విమానాశ్రయం మంజూరైనట్లుగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతున్నారని, నాడు కాంగ్రెస్ హయాంలో ఎయిర్‌పోర్టు ఆలోచన మాత్రమే చేసారని, టిడిపి అధికారంలోకి రాగానే సిఎం చంద్రబాబు దగదర్తిలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారని తెలిపారు. భూసేకరణలో తలెత్తుతున్న సమస్య కారణంగా అధికారులు అలా స్పందించారు తప్ప తరలించాలని కాదని వివరించారు. భూసేకరణలో రైతులకు అన్యాయం జరిగిందని కావలి ఎమ్మెల్యే ఆరోపిస్తున్నారని, ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తున్న మూడు గ్రామాల్లో ఏ రైతుకు అన్యాయం జరిగిందో నిరూపించాలని బీద సవాల్ విసిరారు. 70 శాతం మంది వైసిపికి చెందిన వాళ్లే అక్కడ లబ్ది పొందారని చెప్పారు. ఈ సమావేశంలో మాజీమంత్రి తాళ్ళపాక రమేష్ రెడ్డి, టిడిపి నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నగరాధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ మాజీఛైర్మెన్ తాళ్ళపాక అనూరాధ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



## 'ప్రభా'తం

# బ్రిటన్‌పై ఉగ్ర పంజా

**ఉగ్రవాదానికి ప్రాంతాలతో పనిలేదు..ప్రాణాలు తీయడమే పని. ఇటీవల బ్రిటన్‌లోని మాంచెస్టర్‌లో ప్రపంచ ప్రఖ్యాత పాప్‌స్టార్ అరియానా గ్రాండే నిర్వహించిన సంగీత విభావరి ప్రాంతంలోనూ ఉగ్రవాదం మరణమృదంగం మోగించింది. ఆత్మాహుతి దాడితో 22మంది ప్రాణాలను బలిగొనింది. ఎంతకాలమీ దారుణ మారణకాండలు?..ఇకనైనా, ఉగ్రవాద నిర్మూలనే ప్రపంచ దేశాల తక్షణ కర్తవ్యం కావాలి. అందుకు అన్నిదేశాలు కలసి ఉగ్రవాదంపై సమిష్టి పోరుకు సమాయత్తం కావాలి.**

ఉగ్రవాదానికి ప్రాంతాలతో పనిలేదు..ప్రాణాలు తీయడమే పని. అది ఏ ప్రాంతమైనా సరే, జనంపై పంజా విసరడం, అందినంతమందిని పైశాచికంగా మట్టుబెట్టడం..అదే పెద్ద ఘనకార్యంగా తన భుజాలు తానే చరుచుకోవడం ఉగ్రమూకల నైజం. దేశమేదైనా, ప్రాంతమేదైనా సరే.. ఎక్కడికక్కడ ఆత్మాహుతి దళాలను పంపి, అమాయకులను చంపి వారి నెత్తురుని అత్తరులా చల్లుకొని ఆనందించే రాక్షసత్వమే ఉగ్రవాదం. ఈ ఉగ్రవాదోన్మాదానికి ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది బలి అయిపోతూనే వున్నారు. ఈ విషసర్పాన్ని అంతం చేస్తామని, ప్రపంచంలో దాని ఉనికే లేకుండా చేస్తామని ఇలాంటి ఘటనలు జరిగినప్పుడల్లా అగ్రరాజ్యాలు భీషణ ప్రతిజ్ఞలు చేస్తున్నా, తీరా ఆచరణలోకి వచ్చేసరికి ఉగ్రవాదం బుసలకు తట్టుకోలేక డీలా పడిపోతున్నాయి.

మొన్నటికి మొన్న ప్రపంచ అగ్రరాజ్యాల్లో ఒకటైన బ్రిటన్ పరిస్థితి కూడా ఇదే. బ్రిటన్‌లోని మాంచెస్టర్‌లో ప్రపంచ ప్రఖ్యాత అమెరికన్ పాప్‌స్టార్ అరియానా గ్రాండే సారధ్యంలో అత్యద్భుతంగా నిర్వహించిన సంగీత విభావరి ప్రాంతంలో మరణమృదంగం మోగించాలని ఇస్లామిక్ స్టేట్ అనే ఉగ్రవాద సంస్థ వ్యూహం పన్నింది. అనుకున్నదే తడవుగా ఆత్మాహుతి దాడితో ఆ ప్రాంతాన్ని రక్తసిక్తం చేసింది. ఏకంగా 22 మంది ప్రాణాలను బలితీసుకుని, మరో 120 మందిని తీవ్ర గాయాలపాలు చేసి ఉగ్రవాదోన్మాదం వికటాట్టహాసం చేసింది. బ్రిటన్‌పై ఇస్లామిక్ స్టేట్ జరిపిన తొలి ఆత్మాహుతి దాడి ఇదే. ఈ ఘటనతో అక్కడి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ఉగ్రవాద రక్కసుల వల్ల ప్రపంచంలో ఎక్కడ ఎలాంటి భీభత్సం జరుగుతుందో.. ఎందరు ప్రాణాలు పోగొట్టుకోవాల్సివస్తుందో అర్థం కాక ప్రపంచ మానవాళి సైతం భయకంపితమవుతోంది. అత్యద్భుతమైన అరియానా గ్రాండే సంగీతం విని తన్మయులై ఆ సంగీత విభావరి పూర్తికాగానే ఆనందోత్సాహాలతో ప్రజలు ఇళ్ళకు తిరిగి బయలుదేరేందుకు బయటకు రాగానే, వేదికకు కొద్దిదూరంలోనే జరిగిన ఈ ఆత్మాహుతి దాడితో ఒక్కసారిగా అక్కడి వాతావరణమంతా భీభత్సంగా మారిపోయింది. హాహాకారాలతో, ఆర్తనాదాలతో.. అరుపులు కేకలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. ఈ మారణకాండ ఉదంతం తెలిసి అరియానా గ్రాండే నిలువెల్లా కంపించిపోయింది.. నోట మాట రాక కన్నీటిపర్యంతమైంది. ఈ దాడి జరిగిన మాంచెస్టర్ ఎరీనా హాలు యూరప్‌లోనే అతిపెద్దది కావడం విశేషం. ఇందులో ప్రవేశం ఎంతో కట్టుదిట్టంగా వుంటుంది. అయినా ఒకే ఒక్క ఉగ్రవాది అక్కడకు చేరుకుని, ఆత్మాహుతి దాడి చేయడానికి ఆ ప్రాంతంలోకి అడుగుపెట్టగలిగాడంటే ఉగ్రవాదులు ఎంత పక్కా వ్యూహంతో వుంటారో తేటతెల్లమవుతోంది. ఉగ్రవాదం పట్ల ఏ ప్రాంతం వారైనా సరే, ఏమాత్రం ఏమరుపాటుగా వున్నా క్షణాల్లోనే ఎంత ఘోరం జరిగిపోతుందో ఈ సంఘటన ప్రపంచానికి చాటి చెప్తోంది. అందులోనూ ఈ సంగీత విభావరికి వచ్చిన జనమంతా అత్యధికశాతం మంది యువకులు.. చిన్నారులే. అందులోనూ, అరియానా గ్రాండే అంటే ఎంతో అభిమానం కలిగిన ఎనిమిదేళ్ళ చిన్నారి సఫీ రోజ్ ఆ పాటలు వినేందుకు వచ్చింది. గ్రాండే సంగీతం విని ఎంతో ఆనందించి, చిరునవ్వులతో బయటకు వస్తుండగా ఈ భయంకరమైన ఉగ్రదాడి జరగడం.. ఆ చిన్నారి కూడా క్షణాల్లోనే ఈ దాడికి బలి కావడం... ఎంత దారుణం! ఆ చిన్నారి మరణంతో పాటు, ఈ దుర్ఘటన ప్రపంచ ప్రజలను కంటతడి పెట్టించింది. బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రులు, తల్లిదండ్రులను కోల్పోయిన బిడ్డలు, ఆత్మీయులను సహచరులను కోల్పోయినవారి వేదనా రోదనలతో...ఆ ప్రాంతం శోకసంద్రంగా మారింది.

అయినా, ఎవరెంతగా రోదించినా.. ఎవరెంత కన్నీరు కార్చినా, ఎంతమంది ప్రాణాలు కోల్పోయినా ఉగ్రవాద రాక్షసమూకలకు లెక్కే లేదు. ఆ కిరాతకులకు కావాల్సింది కూడా ఇలాంటి రోదనలే. తమ ఉన్మాదానికి ఎంతమంది బలైతే అంత సంతోషం ఆ రాక్షసులకు. ఒక్క బ్రిటన్‌లోనే కాదు, దాదాపు అన్నిదేశాల్లోనూ, అన్ని ప్రాంతాల్లోనూ..ముఖ్యంగా జనం ఎక్కడ ఆనందంగా వుంటే అక్కడంతా ఉగ్రదాడులకు తెగబడుతూ వారు తమ రాక్షసత్వం చాటుకుంటూనే వున్నారు... ప్రపంచాన్ని నిత్యం భయకంపితం చేస్తూనే వున్నారు. రెండేళ్ళ క్రితం ఫ్రాన్స్‌లో సాకర్‌పోటీ సమయంలో ఉగ్రవాదులు దాడులుచేసి 128 మందిని హతమార్చారు. గతంలో స్పెయిన్‌లోనూ రైళ్ళలో బాంబులు పేల్చి 200 మంది ప్రాణాలు తీశారు. ఉగ్రవాదుల దాడుల లెక్కవేసుకుంటూపోతే లెక్కకే అందనంతగా వుంటోంది. మాంచెస్టర్‌లో ఈ పైశాచికత్వం తమదేనని, 'మీ పిల్లలను చంపేశాం..ఇంకా చంపుతాం' అంటూ ఐఎస్ ప్రకటించడం చూస్తుంటే, ఆ ఉగ్రవాద రక్కసి ఎంత నీచమైనదో..ఎంతగా బరితెగించివుందో.. ప్రపంచానికి ఎంత ప్రమాదకారిగా మారిందో అర్ధమవుతుంది. ఈ ఆధునిక యుగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంతో విస్తరించిపోతోందని ప్రపంచం సంబరపడిపోతుంటే, మరోవైపు ఆ సాంకేతిక విజ్ఞానాన్నే ఉగ్రవాదులు అందిపుచ్చుకుని ఇంటర్‌నెట్, యూట్యూబ్, వాట్సాఫ్, ఫేస్‌బుక్ తదితర మాధ్యమాల్లో ఉగ్రవాదాన్ని ప్రచారం చేసుకుంటున్నారు. తద్వారా ప్రపంచమంతా విషబీజాలు నాటుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని పొట్టనపెట్టుకుంటూ అమాయక ప్రజల ఉసురుపోసుకుంటున్న ఈ ఉగ్రవాదపు విషవృక్షాన్ని కూకటివేళ్ళతో సహా కూల్చివేసి ప్రపంచానికి శాంతిని..కాంతిని అందించే రోజు ఎప్పుడు వస్తుందోనంటూ ప్రపంచ మానవాళి అంతా నిరీక్షిస్తూనే వుంది. ప్రధాని మోదీ చెప్పినట్లు, ప్రపంచదేశాలన్నీ ఒకేవేదిక మీదకు వచ్చి ఉగ్రవాదంపై సమిష్టిపోరుకు సమాయత్తమైతే తప్ప ఈ ఉగ్రవాదం పీడ విరగదు. అందుకు ప్రపంచవ్యాప్తంగా వున్న మేధావులు..దేశాధినేతలంతా కలసిరావాలి.. ఉగ్రవాదం పీచమణచడమే తక్షణ కర్తవ్యంగా.. అన్ని దేశాలు కలసి తగు కార్యాచరణ పథకంతో ముందుకు రావాలి. అప్పుడే ఈ పిశాచి పీడ విరగడవుతుంది. ఆరోజు త్వరలోనే వస్తుందని ఆశిద్దాం!...

# విఆర్ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి

**- ఏబివిపి నాయకుల డిమాండ్**



రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు విఆర్ విద్యాసంస్థల ఆస్తులను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30వ తేదీలోగా స్వాధీనం చేసుకోవాలని, ఆ ఆస్తులను స్వాధీనం చేసేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ఏబివిపి నాయకులు డిమాండ్ చేశారు. నెల్లూరులోని విఆర్ కళాశాల సెంటర్‌లో ఏబివిపి ఆధ్వర్యంలో సోమవారం సాధనా దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కో-కన్వీనర్ కౌషిక్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఆ ఆస్తులను స్వాధీనం చేసుకోనిపక్షంలో ఏబివిపి ఉద్యమం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి నాయకులు మల్లికార్జున, వెంకటేష్, నరేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, నాయకులు తేలపల్లి రాఘవయ్య, మిడతల రమేష్, మెంటా రామ్మోహన్‌రావు తదితర నాయకులు ఈ సాధనా దీక్షకు తమ సంఘీభావం తెలిపారు.

# నెల్లూరులో పోలీస్ స్పెషల్ డ్రైవ్



నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ ఆదేశాల మేరకు నెల్లూరు నగర డిఎస్పీ జి.వెంకటరాముడు ఆధ్వర్యంలో ఆదివారం సివిల్, ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రెండు గంటల పాటు నెల్లూరు నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో పోలీసులు బైక్‌లను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బైక్ హారన్లు, సైలెన్సర్లు మార్చిన, మితిమీరిన వేగంతో వెళుతున్న, వాహన పత్రాలు, నెంబరు ప్లేట్లు లేని 50కి పైగా బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ప్రధానంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి భారీ జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. రేసింగ్‌ల కోసం ప్రత్యేకంగా రూపుమార్చుకున్న బైక్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ వెంకటరాముడు మాట్లాడుతూ మితిమీరిన వేగం, మద్యం మత్తులో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయన్నారు. నేరనియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో నగర ట్రాఫిక్ డిఎస్పీ నిమ్మగడ్డ రామారావు, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు కె.రామకృష్ణారెడ్డి, పాపారావు, వెంకటరావు, ఎస్సైలు జగత్‌సింగ్, శ్రీహరి, నాగభూషణం, భాస్కరయ్య, బలరామయ్య, నారాయణరెడ్డి, కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.




## తపాలా శాఖ మారాలి

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా పనిచేసే సంస్థగా భారత తపాలాశాఖకు పేరుంది. యాభైపైసల పోస్టుకార్డు గల్లీ నుండి ఢిల్లీ దాకా వెళుతుంది. కొరియర్ వ్యవస్థ వచ్చిన తర్వాత తపాలా శాఖ నిర్వీర్యమైపోయింది. మారిన సాంకేతిక పరిజ్ఞానం వల్ల నాబోటి ఛాందసుడు తప్ప కార్డు ముక్క వ్రాసే నాథుడు కనపడడం లేదు. ఆ కార్డు ముక్కల బట్వాడా కూడా సరిగాలేదు. టపాలు పెరిగితే సిబ్బంది చించి చెత్తబుట్టలో వేస్తున్నారు. దీంతో ఇంటర్వ్యూ లెటర్లు, ప్రాణాంతక విషయాలు తెలియక వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చొరవ తీసుకుని తపాలా శాఖకు పూర్వవైభవం తీసుకురావాలని మనవి.

**- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## రౌడీ ఎమ్మెల్యేలపై చర్యలేవి?

ఒక ఎమ్మెల్యే తహశీల్దార్‌ను ఇసుకలో జుట్టుపట్టి ఈడ్చి కొట్టాడు. ఇంకో ఎమ్మెల్యే ఆర్టీవో ఆఫీసర్‌పైనే దౌర్జన్యం చేసాడు. అంతేకాదు, క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ చిన్నారి మృతికి కారకుడయ్యాడు. మొన్ననే మరో ఎమ్మెల్యే తన ఆఫీసులోనే ఎస్ఐని నిర్బంధించాడు. వీళ్ళంతా అధికారపార్టీ ఎమ్మెల్యేలే! ఒక్కరి మీద కూడా చర్యల్లేవ్! దేశంలోనే నెంబర్ సిఎంనని చంద్రబాబు చెప్పుకుంటుంటాడు. నిన్నగాక మొన్నొచ్చిన పళనిస్వామి సీఎంగా వున్న తమిళనాడులో కూడా ఇంతటి ఘోర పరిస్థితి లేదు.

**- కె.రామనారాయణరెడ్డి, ఆత్మకూరు.**

## మున్సిపల్ పన్నుల వసూళ్ళు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ప్రకారం ఎటువంటి నిర్మాణాలు లేని ఖాళీ స్థలంపై పన్ను వసూలు చట్ట విరుద్ధమని చెప్పబడింది. ఆస్థి పన్ను లెక్కింపునకు సంబంధించి 1970లో ఇదే హైకోర్టు స్పష్టమైన తీర్పు వెలువరించింది. అంతేగాక జి.హెచ్.యం.సి. నిబంధనల్లో ఖాళీ స్థలంపై పన్ను అనేది లేకుండా పన్ను వసూలు చేయరాదని హైకోర్టు తీర్పు ఇచ్చింది. అయితే ఖాళీ స్థలం కాకుండా, అలాగే సంవత్సరాల తరబడి బీడు పడివున్న అనివాసిత భవనాలకు మాత్రం ఆస్థిపన్ను చెల్లింపు విషయంలో హైకోర్టు జోక్యం చేసుకోలేదు. కనుక నగరపాలక సంస్థ వారు ఖాళీ స్థలం కాకుండా, అనివాసిత భవనాలకు ఆస్థి పన్ను లెక్కించి వసూలు చేయటం ఎట్టి అభ్యంతరం లేదని పై తీర్పు వల్ల తెలుస్తోంది. కనుక నగర పాలక సంస్థ వారు నగరంలోని అనివాసిత భవనాలను కనుగొని, వాటికి పేరుకుపోయిన ఆస్థి పన్నులను వసూలు చేయవలసిందిగా మనవి చేస్తున్నాను.

**ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.**

# ఎగరకుండానే వెళ్ళిపోయింది!



## • ఎయిర్‌పోర్టు హుష్‌కాకి... భూసేకరణ లోసుగులే ప్రధాన కారణం

ఎన్నెన్ని ప్రకటనలు... ఎన్నెన్ని ప్రతిపాదనలు... ఎంతమంది పర్యటనలు... ఎన్నిసార్లు నోటిఫికేషన్లు... ఇదిగో ఎయిర్‌పోర్టు అంటే, అదిగా విమానం అంటూ ఇప్పటిదాకా ఊదరగొట్టారు. అంతెందుకు నిన్నగాక మొన్న మంత్రి నారాయణను పరామర్శించడానికి వచ్చిన కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు ఏం చెప్పాడు... త్వరలోనే నెల్లూరులో నుండి విమానం ఎగురుద్దని చెప్పాడు. ఆయన నెల్లూరులో నుండి విమానం టేకాఫ్ అవుద్దని చెప్పాడో, లేక నెల్లూరు మీదుగా విమానం పోతుందని చెప్పాడో అర్ధం కావడం లేదు. ఎందుకంటే ఆయన ఆ స్టేట్‌మెంట్ ఇచ్చిన రెండోరోజే అదే మంత్రి నారాయణను పరామర్శించడానికి నెల్లూరొచ్చిన ఎనర్జీ, పెట్టుబడుల శాఖ మంత్రి అజయ్‌జైన్ నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలోని దామవరం వద్ద మంజూరైన ఎయిర్‌పోర్టును రద్దు చేస్తున్నట్లు, దీనిని మరో జిల్లాకు తరలిస్తున్నట్లు చెప్పి జిల్లా ప్రజల ఆశలపై నీళ్ళు చల్లాడు.

ఎయిర్‌పోర్టు రద్దుకు భూసేకరణే పెద్ద కారణంగా కనిపిస్తోంది. దామవరం వద్ద ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేట్ భూములు కూడా ఉన్నాయి. ప్రైవేట్ భూములకు అధికరేట్లు ఇప్పిస్తామని చెప్పి స్థానిక అధికారపార్టీ నాయకులు ఇక్కడ రైతులను రెచ్చగొట్టారు. దీనికి వాళ్ళు ఎకరాకు ఇంతని చెప్పి ముందుగానే కమిషన్ కూడా మాట్లాడుకున్నారు. దీంతో ఎయిర్‌పోర్టు కోసం సేకరించే భూములకు రైతులు భారీగా నష్టపరిహారాన్ని ఆశించసాగారు. వారికి నాయకులు కూడా ఆ స్థాయిలో ఆశలు కల్పించారు. అదీగాక ఇక్కడ భూముల ఆక్రమణ, రికార్డులు తారుమారు చేయడం వంటి లొసుగులున్నాయి. ఇక్కడ ఎయిర్‌పోర్టు నిర్మాణం పెద్ద తలనొప్పిగా మారడంతో రద్దు చేసినట్లు తెలుస్తోంది.

### పోర్టు దగ్గర ఎయిర్‌పోర్టా!

కృష్ణపట్నం పోర్టుకు సమీపంలో ఎయిర్‌పోర్టు రానుందనే ప్రచారం వూపందుకుంది. నెల్లూరుజిల్లా ఎయిర్‌పోర్టును మరో జిల్లాకు తరలించినట్లు చెప్పారు. వాస్తవానికి నెల్లూరుజిల్లాలో కాకుండా ఇంకే జిల్లాలోనూ ఇప్పటికిప్పుడు ఎయిర్‌పోర్టు అవసరం లేదు. కృష్ణా జిల్లా నుండి శ్రీకాకుళం దాకా చూస్తే మూడు ఎయిర్‌పోర్టులున్నాయి. గుంటూరుజిల్లా వాళ్లకు కూడా గన్నవరం ఎయిర్‌పోర్టు దగ్గర. అనంతపురం జిల్లాలో పుట్టపర్తి వద్ద, చిత్తూరు జిల్లాలో రేణిగుంట ఎయిర్‌పోర్టులున్నాయి. కడపలో ఇటీవలే ఎయిర్‌పోర్టును ప్రారంభించారు. ఇక కర్నూలుకు ఇప్పుడు ఎయిర్‌పోర్టు పెద్దగా అవసరం లేదు. వాళ్లకు హైదరాబాద్ రెండున్నర గంటల ప్రయాణం. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్రంలో ఎయిర్‌పోర్టు అవసరం ప్రధానంగా నెల్లూరుజిల్లాకే వుంది. అదీగాక విశాఖ తర్వాత రాష్ట్రంలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న జిల్లా కూడా ఇదే కావడంతో ఎయిర్‌పోర్టు దామవరం వద్ద కాకపోయినా త్వరలో మరో దగ్గర మంజూరయ్యే అవకాశముంది.


# ఆయన వద్దన్నాడు.. ఈయన ముద్దన్నాడు!





జిల్లా తెలుగుదేశంపార్టీలో పలువురు నాయకులు కొండంత ఆశలు పెట్టుకున్న 'నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' ఛైర్మెన్ పదవిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దాదాపు ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. తెలుగుదేశంపార్టీ నెల్లూరు నగర అధ్యక్షుడు, యువరత్న నందమూరి బాలకృష్ణ అనుచరుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఈ పదవి ఖాయమైపోయిందని, అధికారిక ప్రకటన వెలువడడమే మిగిలుందని సమాచారం.

వాస్తవానికి చంద్రబాబు ఆలోచన ప్రకారమైతే కోటంరెడ్డి శీనయ్య పేరు పరిశీలనలోకి కూడా వచ్చి ఉండేది కాదు. కాని, తన నమ్మిన బంటుగా వున్న కోటంరెడ్డి శీనయ్యకు ఈ పదవి ఇవ్వాల్సిందేనని బాలకృష్ణ ఖరాఖండీగా చెప్పడంతో ఇక చంద్రబాబుకు తప్పలేదు. నుడా ఛైర్మెన్ పదవి కోసం కోటంరెడ్డి శీనయ్యతో పాటు టి.అనూరాధ, డాక్టర్ జడ్.శివప్రసాద్, దేశాయిశెట్టి హనుమంతురావులు కూడా పోటీ పడ్డారు. ఓ దశలో తనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వలేదని అలిగిన ఆనం వివేకానందరెడ్డిని 'నుడా' ఛైర్మెన్ పదవి తీసుకోమని చంద్రబాబు కోరినట్లు తెలిసింది. అయితే, అందుకు వివేకా ఒప్పుకోలేదు. 'నుడా'కు ఇంతవరకు తాడు, బొంగరం లేదు. 'నుడా' ఆఫీసు ఏర్పడి ఒక దారిలోకి వచ్చేసరికే సంవత్సరం పడుతుంది. ఆ తర్వాత ఇంకో సంవత్సరం లోపే ఎన్నికలు. ఆ తర్వాత రాజెవడో, రైతెవడో... అదీగాక 'నుడా' పరిధిలో నిధులు వెల్లువలా వచ్చి జరిగే డెవలప్‌మెంట్ కూడా ఏమీ లేదు. అదే, ఎమ్మెల్సీ అయితే ఏ పార్టీ అధికారంలో వున్నా ఆరేళ్లు ఎవరూ కదిలించలేరు. ఈ ఉద్దేశ్యంతోనే వివేకా 'నుడా' ఛైర్మెన్‌ను వద్దనుకున్నట్లు తెలుస్తోంది. వివేకా 'నుడా'కు ఒప్పుకుని వుంటే బాలయ్యను చంద్రబాబు ఒప్పించగలిగి వుండేవాడు. వివేకా వద్దనడంతో కోటంరెడ్డి శీనయ్యకు దాదాపు రూటు క్లియర్ చేశారు. కోటంరెడ్డి 2014 ఎన్నికల్లోనే నెల్లూరు నగరం సీటును ఆశించాడు. బాలకృష్ణ కూడా శీనయ్యకు సీటు కోసం ప్రయత్నించాడు. అయితే సీటు గ్యారంటీతో తెలుగుదేశంలో చేరిన ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డికి ఆరోజు సీటివ్వాల్సి వచ్చింది. ఈరోజు 'నుడా' విషయంలో బాలకృష్ణ పంతం పట్టడంతో శీనయ్యకు మార్గం సుగమం అయ్యింది.



# కనిపిస్తే కాల్చుడే!

## - పందులపై కమిషనర్ సీరియస్ వార్నింగ్

నెల్లూరు నగరంలో మంత్రులు, మేయర్, కార్పొరేటర్లు... అందరూ వందల కోట్లలో అభివృద్ధి పనుల గురించి మాట్లాడేవాళ్లే! కాని మూడేళ్లుగా చూస్తున్నాం కదా... మాటలెక్కువ, పనులు తక్కువ అన్నట్లుగా వుంది పనితీరు. నగరంలో ప్రజలకు ప్రధాన సమస్యగా మారింది పందులు, దోమలు. ఇప్పుడు కాస్తున్న ఎండల దెబ్బకు ముదురుదోమలు మలమల మాడి చస్తున్నాయి. కాని, పందులు మాత్రం తగ్గడం లేదు. నెల్లూరులో మనుషుల కంటే పందులు సంఖ్య పెరిగిపోతోంది. కొంతమంది వీటిని కోసుకుని తింటుండబట్టి సరిపోతుంది గాని లేకుంటే నెల్లూరు రోడ్లు, వీధుల్లో మనుషులు నడవడానికి కూడా సందులేనంతగా పందులు తిరుగుతుండేవి. నెల్లూరు నగరంలో మురికివాడల్లోనే కాదు, నెల్లూరు జూబ్లీహిల్స్‌గా చెప్పుకునే మాగుంట లే అవుట్, ఆదిత్యనగర్ వంటి ప్రాంతాల్లో కూడా పందులు మందలు మందలుగా తిరుగుతున్నాయి. పందుల పెంపకందార్ల దెబ్బకు జడిసి పాలకులు పందుల ఏరివేత జోలికి పోవడం లేదు. కాని, కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు మాత్రం పందుల విషయంలో చాలా సీరియస్‌గా వున్నాడు. 22వ తేదీ ఆయన తన ఛాంబర్‌లో శానిటేషన్ అధికారులు, పందుల యజమానులతో మీటింగ్ పెట్టుకున్నారు. పందుల ఏరివేతకు వాళ్లకు 45రోజుల గడువిచ్చారు. ఆ గడువు తర్వాత ఏ సందులో పంది కనిపించినా కాల్చివేస్తామని గట్టిగానే వార్నింగ్ ఇచ్చారు. ఈ విషయంలో కమిషనర్ గట్టిగానే వున్నట్లు కనిపిస్తోంది. ఆయన వార్నింగ్ పనిచేస్తే 45రోజుల తర్వాత మనకు నగరంలో చూద్దామనుకున్నా పందులు కనిపించకపోవచ్చు.



## టిజిపి స్పెషల్ కలెక్టర్‌గా ప్రశాంతి



తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్‌గా పి.ప్రశాంతి 22వ తేదీ తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు సతీమణి అయిన ప్రశాంతి విజయనగరం జిల్లాలో డిఆర్‌డిఏ పి.డిగా పనిచేస్తు ఇక్కడకు బదిలీ చేయించుకున్నారు.

## జేసీస్ భవన్ అధ్యక్షుడిగా గుండ్లపల్లి సుధాకర్



నెల్లూరు పప్పులవీధిలోని జేసీస్ భవన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం రాత్రి జరిగింది. జేసీస్ భవన్ గౌరవాధ్యక్షుడిగా కోట సత్యనారాయణ, అధ్యక్షుడిగా గుండ్లపల్లి సుధాకర్‌రావు, కార్యదర్శిగా పి.జనార్ధన్, కోశాధికారిగా బి.వి.సురేష్‌కుమార్ ప్రమాణస్వీకారం చేసారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సుధాకర్‌రావు మాట్లాడుతూ భవనం అభివృద్ధికి సమాజసేవకు తనవంతు కృషి చేస్తానన్నారు.

## టగ్ ఆఫ్ వార్ రాష్ట్ర అధ్యక్షుడిగా యం.వి.సుబ్బారెడ్డి



ఆంధ్రప్రదేశ్ టగ్ ఆఫ్ వార్ అధ్యక్షుడిగా యం.వి.సుబ్బారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలోని నేతాజీ పైలట్ స్కూల్లో ఏపి టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ నాయకులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా విక్టర్(నెల్లూరు), కోశాధికారిగా శివరామ్(కృష్ణా), ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజేంద్ర(ప్రకాశం), జాయింట్ సెక్రటరీగా సుధాకర్(గుంటూరు), ఈసీ మెంబర్లుగా సుకుమార్, శ్రీధర్, రమణయ్య ఎంపికయ్యారు. అన్ని జిల్లాలకు రోప్స్, వేయింగ్ మిషన్లను సరఫరా చేయనున్నట్లు సుబ్బారెడ్డి తెలిపారు.

నెల్లూరు కబుర్లు

## మారుతి సేవలో కోటంరెడ్డి



ఈ నెల 21న 33వ డివిజన్ పరిధిలోని ఎన్‌సిసి కాలనీలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ డా॥ సత్తార్, శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, రఘు, పెనుబర్తి గ్రామ వైస్‌ప్రెసిడెంట్ యదనపర్తి వెంకటేశ్వర్లురెడ్డి, పెనుబర్తి ఎమ్‌పిటిసి పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, పల్లంరెడ్డి రవీంద్రరెడ్డి, తాండ్ర శ్రీనివాసులు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## అపోలోలో అధునాత పద్ధతిలో కీలు మార్పిడి



నెల్లూరు హరనాథపురంలోని అపోలో ఆసుపత్రిలో అధునాతన పద్ధతిలో శస్త్ర చికిత్స చేసి నొప్పి,రక్తస్రావం లేకుండా మోకాలి కీలు మార్పిడి చేస్తున్నామని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డి తెలిపారు. 20వ తేదీ ఆసుపత్రిలో జరిగిన డాక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30ఏళ్ల నుంచి మోకాలు ఆపరేషన్లు జరుగుతున్నప్పటికీ బయోమెకానిక్స్ ద్వారా నొప్పిలేని అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. నూతన పద్ధతుల్లో తాము చేసిన ఆపరేషన్ తరువాత రెండు, మూడు గంటల్లోపే రోగి తన కాలును కదిలించవచ్చన్నారు. రోగి పది రోజుల్లోనే ఎవరి సాయం లేకుండా నడువగలరన్నారు.

## దాహార్తులకు ఎంఎస్ఆర్ మజ్జిగ



మండుతున్న ఎండలకు ప్రజల దాహార్తిని తీర్చేందుకు మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి నడుం బిగించింది. ఇదివరలో నెల్లూరులో పలుచోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేసి ఎండలకు అలసిపోతున్న ప్రజల దాహార్తిని తీర్చింది. ఈ క్రమంలోనే 20వ తేదీ చింతారెడ్డిపాలెం సమీపంలో మాగుంట శరత్‌చంద్రారెడ్డి మరో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. సేవాసమితి సభ్యులు మహేష్, భాస్కర్, విజయ్ కుమార్, కార్తీక్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్స్ షర్బత్ చలివేంద్రం




అందరూ మజ్జిగ, మంచి నీళ్ల చలివేంద్రాలు పెడుతుంటే, అందుకు భిన్నంగా దాహార్తులకు వెరైటీ టేస్ట్ చూపిద్దామని చెప్పి ఏపి ఫోటోగ్రాఫర్స్ జర్నలిస్ట్ అసోసియేషన్‌వాళ్లు షర్బత్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నెల్లూరు కలెక్టరేట్ ఎదురుగా గల ప్రెస్‌క్లబ్ వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని జిల్లా పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ లాల్‌జాన్ బాషా ఈ నెల 22వ తేదీన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపియూడబ్ల్యూజె రాష్ట్ర నాయకులు ఏ.జయప్రకాష్, వక్ఫ్ బోర్డ్ మాజీచైర్మెన్ సమి, ప్రెస్‌క్లబ్ ఇన్‌ఛార్జ్ రాజన్, ఫోటోగ్రాఫర్స్ జాకీర్, మధు, సాహుల్, హరికృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎంజిబి సమ్మర్ కార్నివాల్




రెయిన్‌బో స్కూల్ మరియు ఎంజిబి ఫెలిసిటీ మాల్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంజిబి మాల్ నందు ఏప్రిల్ 25వ తేదీ నుండి మొదలైన 'సమ్మర్ కిడ్స్ కార్నివల్' ముగింపు సంబరాలు ఈ నెల 20వ తేదీన వైభవంగా జరిగాయి. 25రోజుల పాటు చిన్నపిల్లలకు ప్రతిరోజూ మాల్‌లో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఫేస్ పెయింటింగ్, వన్ మినిట్ గేమ్స్, మ్యాథ్స్ ఫజిల్, స్టోరీ టెల్లింగ్, సింగింగ్, ఫ్యాన్సీ డ్రెస్, ఫోక్ డాన్స్ వంటి ప్రదర్శనలు, పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికేట్‌ను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంజిబి మాల్ జనరల్ మేనేజర్ రవికిరణ్, రెయిన్‌బో స్కూల్ డైరెక్టర్ శ్రీమతి పద్మా సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ విద్యాసాగర్, అరుణ స్వయంప్రభ తదితరులు పాల్గొన్నారు.



## విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు

నగరపాలక సంస్థలో కలిసిన విలీన గ్రామమైన పెద్దచెరుకూరులోని ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ నిధుల ద్వారా త్వరితగతిన అభివృద్ధి పనులు చేస్తున్నామని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాడు ఆయన పెద్ద చెరుకూరులోని అరుంధతీయవాడలో 27లక్షల 90వేల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సి.సి.రోడ్డుకు, డ్రైనుకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు కృషి, మంత్రి నారాయణ సహకారంతో నగరపాలక సంస్థకు నిధులు తీసుకుని వచ్చామని, దానిలో భాగంగానే ఈ ప్రాంతానికి నిధులు కేటాయించామని తెలిపారు. ఒక ప్రణాళిక ప్రకారం ఎస్సీ, ఎస్టీ నిధులను ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పవన్‌కుమార్‌రెడ్డి, శేషారెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పారదర్శకంగా 'నుడా' పనులు

## --- తాత్కాలిక ఛైర్మెన్ ముత్యాలరాజు ---

నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) ప్రథమ సమావేశం నుడా తాత్కాలిక ఛైర్మెన్ మరియు జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అధ్యక్షతన సోమవారం కలెక్టర్ బంగ్లాలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నుడాకున్న అధికారాలలో కొన్ని అధికార వికేంద్రీకరణ ద్వారా స్థానిక సంస్థలకు బదలాయిస్తూ చేసిన తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారని, మొత్తం నుడా కార్యక్రమాలను పారదర్శకంగా ఆన్‌లైన్లో నిక్షిప్తం చేస్తామన్నారు. నుడా మార్గదర్శకాలను, లక్ష్యాలను త్వరలో పంచాయతీ అధికారులు, స్థానిక సంస్థల అధికారుల సమావేశంలో వివరిస్తామని తెలిపారు. కొన్ని అధికారాలు స్థానిక సంస్థలకు దాఖలు పరిచినా వాటిని తనిఖీ చేసే అధికారం నుడాకు వుంటుందని వివరించారు. అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకునే అధికారం కూడా నుడాకుంటుందని ఆయన అన్నారు. నుడా పరిధిలోకి 21 మండలాల్లోని 156 గ్రామాలు వస్తాయని, వీటిలో 2 మండలాలు, 11 పంచాయితీలు చిత్తూరుజిల్లాకు చెందినవని ఆయన తెలిపారు. నెల్లూరు, కావలి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీలు నుడా పరిధిలో వుంటాయని మొత్తం 1644.17 చదరపు కి.మీ. పరిధిలో విస్తరించి వుంటుందని ఆయన తెలిపారు.

నుడా కమిటీలో వైస్‌ఛైర్మెన్ మరియు మెంబర్ కన్వీనర్‌గా పెంచలరెడ్డి, ఫైనాన్స్ శాఖ జాయింట్ సెక్రటరి, చిత్తూరు, నెల్లూరు కలెక్టర్లు, టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్, ఆర్ అండ్ బి ఎస్ఇ విద్యుత్ శాఖ ఎస్ఇ, జిల్లా టూరిజం అధికారి, జిఎం. డిఐసి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ, ముగ్గురు నామినేటెడ్ సభ్యులుగా వుంటారని కలెక్టర్ వెల్లడించారు. అంతకుముందు నుడా వైస్‌ఛైర్మెన్ చల్లా పెంచలరెడ్డి నుడా విధి విధానాలను సభ్యులకు వివరించారు.

# సర్వేపల్లి సర్వతోముఖాభివృద్ధికి దీక్ష

## - రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



అధిక వర్షాల ద్వారా నీటిని నిల్వ చేసుకొని వర్షాభావ పరిస్థితుల్లో వినియోగించుకొనేందుకు వీలుగా నీరు–ప్రగతి, నీరు–చెట్టు పథకాల ద్వారా 90రోజుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం మనుబోలు మండలం, పిడూరు పాళెం చెరువుకు 36 లక్షల వ్యయంతో పూడికతీత మరియు చెరువుకట్ట బలోపేతం చేసే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడూరుపాళెం చెరువులో 2015లో అధికవర్షాల వలన చాలా నీరు వృధా అయిందని, గత సంవత్సరం స్లూయిజ్‌లు, ఇతర పనులు పూర్తి చేయడం జరిగిందని, ఈ సంవత్సరం నీటి నిల్వకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. పిడూరుపాళెం చెరువు 600ఎకరాల విస్తీర్ణంలో వుందని, ఆయకట్టు 1200ఎకరాలుగా వుందని ఆయన తెలిపారు. జిల్లాలో రూ.900కోట్లతో 9వేల 200 పనులు మూడు విడతలుగా చేపట్టడం జరిగిందని, సర్వేపల్లి నియోజకవర్గంలో 53కోట్ల 48లక్షల రూపాయల వ్యయంతో 785 పనులు చేపట్టడం జరగగా, జిల్లాలో 350 చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. అదేవిధంగా జైకా పథకం ద్వారా మనుబోలులో 5 చెరువుల అభివృద్ధికై రూ.12కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కృష్ణమోహన్, ఉద్యానవన శాఖ ఉపసంచాలకులు ఉమాదేవి, మనుబోలు యంఆర్ఓ లీలారాణి, ఎంపిడిఓ హేమలత, ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు రాగూర్ పాల్గొన్నారు.

# అపార్ట్‌మెంట్లా? అవినీతికి మెట్లా?



నెల్లూరు నగరంలో 39వేల మంది పేదలు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం మాత్రం 4,800 మందికి మాత్రమే అపార్ట్‌మెంట్‌ల లాగా కట్టి అందులో ఫ్లాట్లు కేటాయిస్తామని చెప్పడం విడ్డూరంగా వుందని నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఆరోపించారు. ఈ అపార్ట్‌మెంట్ల నిర్మాణం వెనుక అవినీతి కథ వుందని, చదరపు గజం 1100 రూపాయలతో నిర్మించే అపార్ట్‌మెంట్‌కు ప్రభుత్వం 2200రూపాయలు ఖర్చవుతుందని చెబుతుందని, అపార్ట్‌మెంట్ల రూపంలో ఈ సొమ్మును స్వాహా చేయడానికి పక్కా స్కెచ్ వేసారని ఆరోపించారు. ఈనెల 22వతేదీన ఆయన నగరంలోని 45, 48వ డివిజన్‌లలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు లేదా తొమ్మిది అంకణాల స్థలం, ఒకటిన్నర లక్ష రూపాయలు ఇస్తే తామే ఇల్లు కట్టుకుంటామని ప్రజలు అడుగుతుంటే, అందుకు భిన్నంగా ప్రభుత్వం అపార్ట్‌మెంట్లు కట్టిస్తామనడం సమంజసం కాదన్నారు.


Estd:1979

N.B.K.R. INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY
(AUTONOMOUS)
Affiliated to JNTUA, Anantapuramu
Vidyanagar, S.P.S.R. Nellore Dt. Phone : 08624 – 228247, www.nbkrist.org

CREDENTIALS
All courses accredited by NBA under tier -1
Accredited by NAAC with 'A' grade
Accorded 'A' grade by Government of AP
College with Potential for Excellence
Robotics Research & Training Center
APSSDC Center
TCS Accredited Institution
D Link Center of Excellence
CYIENT Empaneled Institution
PRIME MEIDEN Skill Transfer Programme

INFORMATION CENTRES
NELLORE
CHANDRA REDDY DEGREE COLLEGE
(Near VRC - 9441443136, 9160455583)
LLF SCHOOL
(Vedayapalem - 9490250405, 9985189413)
VEDAVYASA SCHOOL
(Magunta Layout - 9492431985, 9866303652)
GUDUR
SWARNANDRA BHARATHI JR COLLEGE
(9491170916, 9701691869)
NAIDUPETA
SRI VEMA JR COLLEGE
(9491351267, 9966692406)
SULLURUPETA
SRI SATHYAM JR COLLEGE
(9490096093, 9441567698)
VENKATAGIRI
ESS DEGREE COLLEGE
(9490096093, 9441567698)



NEDURUMALLI RAMKUMAR
CORRESPONDENT

EAMCET CODE
NBKR

FOR ADMISSION
9441572755

MECHANICAL/CIVIL/ECE/EEE/CSE/IT

# కళ్యాణ వైభవం...!



ప్రముఖ శిల్పి, కళారత్న ఆచార్య దేవగుప్తపు రాజ్‌కుమార్ వుడయార్ - జానకిల కుమార్తె **సుమశ్రీ - సాయికృష్ణ చైతన్య** (ఏలూరు వాస్తవ్యులు కరపా రామకృష్ణ - లక్ష్మీల కుమారుడు)ల కల్యాణం మే 11వ తేదీ రాజమండ్రిలోని చెరుకూరి సుబ్బారావు గన్నెమ్మ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరు, విఆర్ కళాశాల ఫిజిక్స్ హెడ్ డా॥ మర్మావుల సుబ్రహ్మణ్యం - రజనిల కుమారుడు **రామచంద్ర కాశ్యప్ - వెంకట నాగనిఖిత** (గుంటూరు వాస్తవ్యులు మల్లాది ఎల్లేశ్వరరావు - విజయలక్ష్మిల కుమార్తెల వివాహం మే 17వ తేదీ విజయవాడలోని అమ్మ కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.



సూపర్‌ఫైన్ రీట్రేడింగ్ కంపెనీ సారథి కొట్టే మధుసూదనరావు - శాంతిల కుమారుడు **శ్రీహర్ష - వెంకటసాయి నిఖిత** (ఒంగోలు వాస్తవ్యులు దండే వెంకటశేషగిరిరావు) - విజయంతిల కుమార్తెల పరిణయం ఈ నెల 17వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

# రాజీవ్‌గాంధీకి నివాళులు



మాజీప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం నెల్లూరు ఇందిరా భవన్‌లో ఆదివారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రధానిగా వున్నప్పుడు అనేక సంస్కరణలు తీసుకు వచ్చారని, సాంకేతికత ఆధునీకరణకు పునాదులు వేసారని కొనియాడారు. అనంతరం ఏసి సుబ్బారెడ్డి స్టేడియం సమీపంలోవున్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిసిసి ఉపాధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి చెంచలబాబుయాదవ్, గాలాజు శివాచారి, ఫయాజ్, మల్లి బాలకృష్ణ, సుమన్, బాలసుధాకర్, అనురాధారెడ్డి, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## వాడవాడలా హనుమజ్జయంతి వేడుకలు



మాలవ్యానగర్ శ్రీరామ కుటీరంలో పూజలు చేస్తున్న భక్తులు

గూడూరులో హనుమజ్జయంతి సందర్భంగా వాడవాడలా అంజనీపుత్రునికి విశేషపూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలుచోట్ల భారీ అన్నదానం చేపట్టారు. గూడూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఆదివారం వేకువజాము నుంచే భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలను సంప్రదాయ బద్ధంగా చేపట్టారు.

గూడూరు రెండో పట్టణం సిరామిక్‌రోడ్డులోని ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వెల్లటూరు సుదర్శనస్వామి, సునీల్‌స్వామి పండితులు విశేషపూజలను నిర్వహించారు. చందనం, కుంకుమలతో అభిషేకాలను చేశారు. మహిళలు సామూహిక పూజలను చేపట్టారు. లక్ష తమలపాకులతో ఆంజనేయుడికి పూజలను చేపట్టారు. తదుపరి అన్నదానం కార్యక్రమం జరిగింది.

గూడూరు రెండోపట్టణ మాలవ్యానగర్‌లోని శ్రీరామకుటీరంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేకపూజలను నిర్వహించారు. 21వ తేదీ సీతారాముల కళ్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. సామూహిక లక్ష తమలపాకులతో ఆంజనేయస్వామికి విశేషపూజలు చేశారు. రాత్రి పట్టాభిషేకం, సువర్చల ఆంజనేయస్వామికి పుష్పయాగం నిర్వహించారు. పట్టణ సిఐ సుబ్బారావు సతీసమేతంగా జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. గూడూరు పట్టణంలోని సాయి సత్సంగం నిలయంలో హనుమంతుని జయంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేకపూజలు చేశారు. సాయిసత్సంగ నిలయంలో గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ హనుమజ్జయంతి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## బీదకు మయూరి శ్యాం సత్కారం



రవిచంద్రను సత్కరిస్తున్న మయూరి శ్యాంయాదవ్, పులిమి శ్రీనివాసులు తదితరులు

టిడిపి జిల్లా అధ్యక్షుడిగా బీద రవి చంద్ర మూడోసారి ఎన్నికయ్యారు. దీంతో పార్టీ వర్గాలు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేసారు. ఈ క్రమంలో భాగంగా శ్రీకృష్ణ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మయూరి శ్యాంయాదవ్ తదితర నాయకులు నెల్లూరుకు వెళ్లి బీద రవిచంద్రకు అభినందనలు తెలిపారు. ఆయన సమక్షంలో కేక్‌ను కట్ చేసి ఆనందం పంచుకున్నారు. అనంతరం బీద రవిచంద్రను మయూరి శ్యాంయాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ అండ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగుల మధుసూదనరావు, ఫౌండర్ డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు, టిడిపి గూడూరు పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, నాయకులు సురేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో లేబొరేటరీ



లేబొరేటరీని ప్రారంభిస్తున్న పొనకా దేవసేన

ప్రజల ఆరోగ్యం మెరుగుపరచడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొంటుందని గూడూరు పురపాలక సంఘం ఛైర్మెన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరు పట్టణంలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాగ్నోస్టిక్ లేబొరేటరీని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో 32రకాల రక్తపరీక్షలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి వై.విద్యాసాగర్, పొనకా శ్రీనివాసులురెడ్డి, భుజగేంద్రరావు, సనత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరు వాసులకు రేషన్ కార్డులు ఇవ్వండి



తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న చేవూరు విజయమోహన్‌రెడ్డి

గూడూరు మండలం చెన్నూరు గ్రామంలో ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డును మంజూరు చేసేలా చూడాలని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు గ్రామంలోని పలు సమస్యలపై సోమవారం ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం ప్రత్యేకదృష్టి సారించి చెన్నూరు గ్రామంలో ప్రజలు ఏ విధంగానూ ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు.

## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు



బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 26.5.2017 నుండి
తేది. 1.6.2017 వరకు

ఈ వారం మీనంలో శుక్రుడు, 31తేది నుండి మేషంలో శుక్రుడు, మేషంలో బుధుడు, వృషభంలో రవి, మిథునంలో కుజుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, కుంభంలో కేతువు, వృషభ మిథున కర్కాటక సింహ రాశు లలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

28తేది కర్తరి సమాప్తము. జ్యేష్ఠ మాసము కావున గృహారంభముహూర్తములు లేవు.

**ముహూర్తములు**

తేది 1 గురువారము ఉదయం గంట 8.38 నుండి గంట 10.48లోగా కర్కాటక లగ్నమున వివాహ వ్యాపార ఉపనయన, విద్యాభ్యాస, అన్నప్రాశనములు.

**జ్యేష్ఠ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 26 | శుక్ర | పాడ్యమి | రా॥ గం.11.47ని॥ |
| తేది. 27 | శని | విదియ | రా॥ గం.9.00ని॥ |
| తేది. 28 | ఆది | తదియ | రా॥ గం.6.40ని॥ |
| తేది. 29 | సోమ | చతుర్ధి | సా॥ గం.4.28ని॥ |
| తేది. 30 | మంగళ | పంచమి | ప॥ గం.2.30ని॥ |
| తేది. 31 | బుధ | షష్ఠి | ప॥ గం.12.48ని॥ |
| తేది. 1 | గురు | సప్తమి | ప॥ గం.11.40ని॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థికపరమైన ఇబ్బందులుండినను ఆదాయంలో ఏం రాదు. కుటుంబ పరముగ సమస్యల నుండి బయట పడతారు. వ్యాపారవృద్ధికి ప్రయత్నాలు చేపట్టగలరు. బిడ్డల విద్యా ఆరోగ్య విషయాలపై శ్రద్ధ చూపుతారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. అనవసరమైన బాధ్యతలు తీసికొనడం, హామీలివ్వడం చేయవద్దు. ఆర్థిక లావాదేవీలు చేయవద్దు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థికంగా బాగుండి, ఆదాయం పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు లభించగలవు. పర్మిట్లు, లైసెన్సులు వంటివాటి కొరకు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కొత్త ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అధికారులకు స్థానమార్పు మరియు అదనపు బాధ్యతలుంటాయి. అనుకున్న పనులు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యవహారాలను జాగ్రత్తగా నడపండి. బంధువుల వల్ల ఇబ్బందులు రావచ్చును. అనుకోని అదనపు ఖర్చు లుంటాయి. కొన్ని పనులకు ఆటంకాలు, కొన్ని పనులు అనుకోని విధంగా అనుకూలించడం జరుగుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, రావలసిన బాకీలు నిలబడిపోవడం జరుగుతుంది. విద్యావకాశాలు బాగుం టాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తివ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. ఆశించినంత ఆదాయముండదు. పలు రకాలుగా ఖర్చుల భారం పెరుగుతుంది. అనుకున్న పనులకు ఆటంకాలు కలిగి తొలుగుతాయి. దూరప్రయాణాలు ఖరారు కాగలవు. పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు నిదానంగా సాగుతాయి. తొందరపాటు మాటలు మానడం మంచిది.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

చేపట్టిన పనులందు చిన్న ఆటంకాలు వచ్చినా అనుకూలంగా నెరవేరతాయి. తొందరపాటు నిర్ణయాలు, తొందరపాటు సంభాషణలు చేయకండి. వృత్తి వ్యాపా రాలలో మంచి అవకాశాలు, ఆదాయం ఉంటుంది. కొత్త పెట్టుబడులు, కొత్త వ్యాపారాలను సంకల్పిస్తారు. నిర్మాణ పనులు వేగవంతం కాగలవు. ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. రావలసిన బాకీలు వాయిదా పడతాయి.

### మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులకు ఆటంకాలుండి నిదానంగా జరుగుతాయి. కుటుంబ, ఆర్థిక విషయాలలో పెద్దల సలహా పొందండి. పెట్టుబడులు, స్థిరాస్తుల మీద ఆదాయం ఉంటుంది. వ్యాపారవృద్ధికి అవకాశాలు లభిస్తాయి. ఆదాయం సంతృప్తికరం. ఉద్యోగులకు అధికార వర్గం నుండి సహాయ సహకారాలుంటాయి. ఉన్నతవిద్యావకాశాలు దూరప్రయాణాలుంటాయి.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అవసరాలేవైనను, కొంత ఋణం చేస్తారు. స్థిరా స్తుల లావాదేవీలను వాయిదా వేసికొనడం మంచిది. వృత్తి వ్యాపారాలు అభివృద్ధి చెంది ఆదాయం సంతృప్తి కరంగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. రావలసిన బాకీలు వాయిదా పడతాయి. అనవసర విషయాలను పట్టించుకొనవద్దు. షేర్లు, స్థిరాస్తులు, పెట్టుబడులపై ఆదాయముంటుంది.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అనుకున్న పనులు నెరవేరుతాయి. మీ సూచనలు, సలహాలు అందరూ ఆమోదిస్తారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. అయితే కుటుంబ ఖర్చులు కూడా అదనంగా పెరుగుతాయి. సోదరుల కుటుంబాలకు మేలు జరుగుతుంది. న్యాయ వైద్య రంగాల వారికి అభివృద్ధి ఉంటుంది. ఉద్యోగ నిర్వహణలో సమస్యలు దాటుకుంటారు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

డబ్బు, వస్తువులు జాగ్రత్త పరచుకొనండి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతున్నా టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపార రంగాలలో మీ అభివృద్ధి ప్రయత్నాల కృషి ఫలిస్తుంది. ఆదాయం పెరుగుతుంది. బంధుమిత్రులతో చిన్న అభిప్రాయబేధాలు రావచ్చు. సర్దుబాటు చేసి కొనండి. ప్రభుత్వ అనుమతులు లభించగలవు.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

చేసే పనిలో ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉండి ఇతరులు సహాయపడతారు. అయితే టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. గృహ వస్తువాహన రిపేర్లు ఖర్చులు పైన బడగలవు. వృత్తి వ్యాపారాలలో కష్టానికి తగిన ప్రతి ఫలముంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. వృత్తిలో ఇబ్బందులను అధిగ మించగలరు. అవసరంలేని హామీలు ఇవ్వవద్దు.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

మీ ఆలోచనలు, పథకాలను అమలు చేయడానికి మంచి సమయం. కొత్త వ్యాపారాలు, కొత్త పెట్టుబడు లకు అవకాశాలున్నవి. ఆదాయం పెరుగుతుంది. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండండి. శుభ కార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉంటాయి. పిల్లలతో సమస్యలు రావచ్చును.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థిక స్థితి బాగుండి, వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు లభించగలవు. ఆదాయం పెరుగుతుంది. శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తాయి. బిడ్డల ఆరోగ్యం, విద్యపై శ్రద్ధ చూపుతారు. పెండింగ్ వ్యవహారాలలో అనుకూలత బాగుంటుంది. ఉద్యోగులకు అధికారుల ఆదరము అనుకూలత బాగుంటుంది. కొన్ని స్థిరమైన కుటుంబ నిర్ణయాలు తీసికొంటారు.

# ఫేస్‌బుక్ మాయలో పడ్డ దేవాన్ష్

శ్రీను గల్పిక

అది ప్రపంచంలోని ప్రధాన నగ రాలన్నింటిని గ్రైండర్‌లో వేసి రుబ్బితే వచ్చిన అమరావతి రాజధాని నగరం. హైటెకత్తు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన క్యాంప్ ఆఫీసులో మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, గంటా శ్రీనివాసరావు, దేవినేని ఉమా మహేశ్వరరావు, అయ్యన్నపాత్రుడు, పత్తిపాటి పుల్లారావు, సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డిలతో సమావేశమై ఉన్నాడు. రాష్ట్రంలో కాస్తున్న ఎండలపై ఆయన సమీక్షా సమావేశం పెట్టాడు. అప్పుడే మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ లోపలకు వచ్చాడు. వస్తూనే... సార్, రేపు అమరావతి రాజధాని పనులను చూడ డానికి సింగపూర్ నుండి ప్రతినిధుల బృందం వస్తుందంట... ఇప్పుడే ఫోన్ చేసారని చెప్పాడు. ఆ మాట వినగానే చంద్రబాబు... నో... వాళ్లను రావద్దని చెప్పు. మనం ఇండియాలో ఉండడం లేదని చెప్పి వాళ్ల పర్యటనను వాయిదా వేయించు అని చెప్పాడు. అది విన్న నారాయణ... ఏం సార్, రాజధాని నిర్మాణాన్ని మనం సింగపూర్ కంపెనీకి అప్పగించడం లేదా? ఇప్పటిదాకా మనం సింగపూర్‌కు తిరిగిన ట్రిప్పులు దండగేనా... అలాగైతే మా మెడికల్ కాలేజీ భవనాలను కట్టిన చింతారెడ్డి పాలెం మేస్త్రీలను పిలిపించమంటారా? ఈ సింగపూర్ వాళ్ళ కంటే మావాళ్ళే బాగా కడతారు అని మనసులో వున్న మాటను చెప్పాడు. తొందరపడకు నారాయణ... ఆరునూరైనా అమరావతి రాజధాని నిర్మాణం సింగపూర్ కంపెనీదే! అలా సింగపూర్ దేవుడు శాసించాడు, ఈ చంద్రబాబు పాటిస్తాడు. వాళ్లను రేపు రావద్దని చెప్పడానికి కారణమేందంటే... రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఈ అమరావతిలో మరీ ఎక్కువగా వున్నాయి. రాజధాని ప్రాంతం థార్ ఎడారిని తలపిస్తోంది. ఇప్పుడు వాళ్లొచ్చి ఈ ఎండల దెబ్బకు పారిపోయారంటే ఇక ఈ జన్మలో మళ్ళీ ఇక్కడకు రారు. కాబట్టి కొంచెం ఎండలు తగ్గాక వాళ్లను పిలిపిద్దాంలే అని చంద్రబాబు అన్నాడు. నారాయణ కూడా దానికి సరేనన్నాడు. పత్తిపాటి పుల్లారావు వుండి... సార్, మన సచివాలయం ఉద్యోగులు పిల్లలకు ఇచ్చినట్లే తమకూ వేసవికాలం సెలవులు అడుగుతున్నారు. ఈ ఎండలకు వాళ్ల ఒళ్లు తాటరేగిపోతోంది. ఇంత కాలం పాపం హైదరాబాద్‌లో హాయిగా గడి పొచ్చారు. ఈ నెలంతా వేసవి సెలవులిస్తే హైదరాబాద్‌కు పోయి సేద తీరి వస్తా రన్నాడు. వాళ్లకు మాత్రం ఇక్కడ అంతగా విరగదీసే పనేముంది. అలాగే సెలవులు తీసుకోమని చెప్పండని చంద్రబాబు అన్నాడు. దేవినేని ఉమ వుండి... సార్, జగన్ కంటే కూడా సూర్యుడు మనకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా మారాడు. అదరకొస్తున్న ఎండలతో రాష్ట్రమంతటా సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ అసమర్థత, అవినీతి వల్లే ఎండలు ఇంతగా మండిపోతున్నాయని ఆ జగన్ పోయిన చోటల్లా చెబుతున్నాడని వాపోయాడు. అందుకు చంద్రబాబు... రాజకీయాలను ఆ జగన్ కంటే నాలు గాకులు ఎక్కువే చదివాను. మండి పోతున్న ఎండలను తగ్గించేందుకు కేంద్రప్రభుత్వంతో చర్చిస్తా, అలాగే ఐక్యరాజ్యసమితి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళతా! వానల కోసం వరుణయాగాలు చేసినట్లే ఎండలు తగ్గడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 'సూర్య హోమాలు' చేయిస్తా, ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి కోట్లతో 'సూర్య నమస్కార్ నిధి'ని ఏర్పాటు చేస్తా! ప్రతి జిల్లాలో మన పార్టీవాళ్లే ఈ హోమాలు నిర్వ హిస్తారని చెప్పాడు. దేవినేనికి విషయం అర్థమైం... కాస్తున్న ఎండలను ఎంత బాగా సద్వినియోగం చేసుకోగలు గుతున్నార్సార్... మీ బుర్రే బుర్ర అంటూ పొగిడాడు. చంద్రబాబు ఆరోజుకు సమావేశం ముగించి, మా దేవాన్ష్‌కు అక్షరాభ్యాసానికి తిరుమలకు వెళుతు న్నాను, ఎండలను తగ్గించమని ఆ వెంకన్నను వేడుకుని వస్తాను అంటూ ఆయన లేచాడు.

★★★★★

తిరుమలలో శ్రీవారి దర్శనానంతరం చంద్రబాబు, భువనేశ్వరీదేవి, లోకేష్, బ్రాహ్మణి, దేవాన్ష్‌లను ఆస్థాన మండ పంలో కూర్చోబెట్టారు వేద పండితులు. రమణదీక్షితులు గిన్నెలో బియ్యం పోసి దేవాన్ష్ చేత అక్షరాలు దిద్దించసాగాడు. 'అ'... అమ్మ అని చెప్పాడు. దేవాన్ష్ బియ్యం మీద వేలితో 'అమ్మ' అని రాసాడు. 'అ' అమరావతి అని రమణ దీక్షితులు చెప్పాడు. అ... అవినీతి అని దేవాన్ష్ రాసాడు. అది చూసి చంద్ర బాబుతో సహా అందరూ బిత్తరపో యారు. రమణదీక్షితులు మళ్ళీ... 'అ' అంటే అభివృద్ధి అని వ్రాయమన్నాడు. దేవాన్ష్ మాత్రం 'అ' అంటే అక్రమాలు, అన్యాయం అని వ్రాసాడు. అక్షరం మార్చి వ్రాయిద్దామని చెప్పి రమణదీక్షితులు 'ఆ' అంటే ఆనందం అని వ్రాయమన్నాడు. దేవాన్ష్ మాత్రం... 'ఆ' అంటే 'ఆర్భాటం' అని వ్రాసాడు. అది చూసి చంద్రబాబుకు చిర్రెత్తుకొచ్చింది. వెంటనే లేచి వెంక టేశ్వరస్వామి ముందుకుపోయి... "ఉన్నావా అసలున్నావా... ఉంటే కళ్ళు మూసుకుని ఉన్నావా, ఈ లోకం గుడ్డి దనుకున్నావా?" అంటూ పాటెత్తుకు న్నాడు. వెంటనే వెంకటేశ్వరస్వామి ప్రత్యక్షమై ఏంది నాయనా... నీ బాధ అని అడిగాడు. చంద్రబాబు దేవాన్ష్ గురించి చెప్పి, మా వాడు ఎందుకు అలా వ్రాస్తున్నాడని అడిగాడు. అంతా సోషల్ మీడియా ఎఫెక్ట్ నాయనా... అని వెంక టేశ్వరుడు చెప్పాడు. సోషల్ మీడియాకు, మా దేవాన్ష్‌కు సంబంధమేంటని చంద్ర బాబు అడిగాడు. నువ్వే చూడు నాయనా అంటూ స్వామి గాల్లోనే స్క్రీన్ సృష్టించి సీన్‌లు ప్లే చేసాడు.

★★★★★

లోకేష్, బ్రాహ్మణిలు నిద్రలోకి జారుకున్నారు. వాళ్ళు నిద్రలోకి పోగానే దేవాన్ష్ కళ్ళు తెరిచాడు. లోకేష్ స్మార్ట్ ఫోన్‌ను చేతికి తీసుకున్నాడు. ఫేస్‌బుక్ ఓపెన్ చేసాడు. తన తండ్రి ఫోటోలతో వివిధ వ్యక్తులు పెట్టిన పోస్ట్‌లను ఆసక్తిగా చూస్తున్నాడు. టీడీపీ ప్రభుత్వ వ్యతిరేక గ్రూపులు పెట్టే అవినీతి, అక్రమాల పోస్టింగ్‌లలోని అక్షరాలను బాగా గుర్తు పెట్టుకోసాగాడు. ప్రభుత్వ వ్యతిరేక మేసేజ్‌లను దేవాన్ష్ బాగా వంటబట్టించు కున్నాడు. తన తండ్రి ఫోటోను మార్ఫింగ్ చేసి వివిధ భంగిమలలో పెట్టిన పోస్టింగ్ లను దేవాన్ష్ చూడసాగాడు.

★★★★★

ఇక్కడితో ఎయిర్ స్క్రీన్ మీద సీన్‌లు అయిపోయాయి. మీ మనవడి మీద సోషల్ మీడియా ఎఫెక్ట్ బాగుంది. ఆ ప్రభావంతోనే ఈ విధంగా అక్షరాలు వ్రాసాడని చెప్పి స్వామి మాయ మయ్యాడు. చంద్రబాబు కోపంతో... ముందు ఆ సోషల్ మీడియాను బ్యాన్ చేయండ్రా! ఆ సోషల్ మీడియాను కనిపెట్టిన వాళ్లను తెచ్చి బొక్కలో వేయండ్రా అని అరిచాడు.

### శ్రీ సాయిదర్బార్‌లో...

# ప్రథమ పుష్కర మహాకుంభాభిషేకాలు

## శ్రీ సాయినాథునికి స్వర్ణకిరీట ధారణ



నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లో ఉన్న శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరంలో ఈ నెల 19వ తేదీ నుండి ప్రథమ పుష్కర మహాకుంభాభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయి. 19వ తేదీ ఉదయం 6గంటలకు శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానం నుండి 108 కలశాలతో నదీ జలాల స్వీకరణోత్సవం మంగళవాయిద్యాలతో సాయి నామ సంకీర్తనలతో ఊరేగింపుగా శ్రీ సాయిదర్బార్‌కు చేరుకుంది. ఉదయం 8.30గంటల నుండి మృత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. 20వ తేదీ ఉదయం 9గంటల నుండి శ్రీ సాయినాధునికి ప్రత్యేక పూజలు, ధునిపూజ, నవగ్రహహోమం, రుద్రహోమం, సాయిదత్త హోమం, తీర్థప్రసాద వినియోగం జరిగింది. 21వ తేదీ ఆదివారం హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం 6గంటలకు శ్రీ సాయినాథునికి 108 కలశాలు నదీజలాలతో, పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, 7గంటల నుండి ఆంజనేయస్వామికి మన్యసూక్తంతో పంచామృతాభిషేకాలు, ఆకుపూజ తదితర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం 12గంటలకు శిఖరపూజలు, మహాకుంభాభిషేక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 12.30గంటలకు నూతన స్వర్ణకిరీట ధారణ నేత్రపర్వంగా జరిగింది. షిరిడిలోని హేమసాయిరామ్ అన్నపూర్ణ ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీ సైకిల్ స్వామి దివ్య హస్తాలతో సాయినాథ్ మహరాజ్‌కు స్వర్ణ కిరీటధారణ జరిగింది. అనంతరం వేలాది మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. అనంతరం సాయితత్వ ప్రచారకుడు శ్రీశైలానికి చెందిన సాయిదాస్ ఈ నెల 26వ తేదీ వరకు సాయిసచ్ఛరిత్ర సప్తాహ జ్ఞాన యజ్ఞాన్ని ప్రవచించారు. ముఖ్య అతిథులుగా మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పొరేటర్లు ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, అంచూరు జానకి, శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీఛైర్మెన్ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, ఆల్తూరు గిరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హోమాలను, మహాకుంభాభిషేకాలను ప్రధానాచార్యులు, ఆధ్యాత్మిక భాస్కర కోట కృష్ణమూర్తి స్వామి ఆధ్వర్యంలో జరిగింది. శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరం నిర్మితమై మే21వ తేదీకి 12ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాలు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి పర్యవేక్షణలో వైభవంగా జరిగాయి.



# అంత్యక్రియలకు వెళ్తూ... అంతిమలోకాలకు!

### - పాత్రికేయుడు పెంచలప్రసాద్ కన్నుమూత



సీనియర్ పాత్రికేయుడు తోట పెంచలప్రసాద్(46) ఈ నెల23న కన్నుమూశారు. తన మేనమామ మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలకోసం ఫ్లెక్సీలను వేయించుకుని నెల్లూరు నుంచి కలువాయి మండలంలోని నాగావారిపల్లెకు వెళ్తుండగా మార్గమధ్యంలో పెంచలప్రసాద్ వడదెబ్బ తగిలి మరణించారు. నెల్లూరు నుంచి మోటార్‌బైక్‌పై వెళ్తుండగా, దాచూరు సమీపంలోని ముక్కతిప్ప వద్దకు వచ్చేసరికి అస్వస్థతకు గురికావడంతో, ఆదూరుపల్లి-పెంచలకోన రోడ్డు పక్కన చెట్టు కింద సేదతీరుతుండగా వడదెబ్బ తగిలి ఆయన మృతిచెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. కాగా, పెంచలప్రసాద్ నెల్లూరు కేంద్రంగా 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో సీనియర్ పాత్రికేయుడుగా పని చేస్తున్నారు. గతంలో ఈనాడు, 'వార్త' దినపత్రికల్లో కూడా ఆయన పాత్రికేయునిగా పనిచేశారు. ఈ సంఘటన తెలియగానే ఆత్మకూరు డిఎస్పీ సుబ్బారెడ్డి, కలువాయి ఎస్ఐ ఆవుల సైదులు తదితరులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పెంచల ప్రసాద్ మృతి సమాచారం తెలుసుకుని ఆయన భార్య శ్రీలక్ష్మి, కుమారుడు నెల్లూరు నుంచి వచ్చి పెంచలప్రసాద్ మృతదేహాన్ని చూసి పెద్దపెట్టున విలపించారు. ఆంధ్రజ్యోతి సిబ్బంది, సహచర పాత్రికేయులు అందరూ ఆయన మృతికి తీవ్ర సంతాపం ప్రకటించారు. మేనమామ అంత్యక్రియలకు వెళ్తూ మార్గమధ్యంలో మృతిచెందిన పెంచలప్రసాద్ భౌతికకాయాన్ని చూసి ఆయన బంధువుల రోదన వర్ణనాతీతం. ఆయన మరణానికి సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది 'లాయర్'.



పెంచలప్రసాద్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

## పేదల సంక్షేమమే టిడిపి లక్ష్యం

ఆరోగ్యశ్రీ వర్తించని ఆరు పేదకుటుంబాల వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 8.90 లక్షల రూపాయలను మంజూరు చేసిందని, పేదల సంక్షేమమే టిడిపి లక్ష్యమని టిడిపి నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆ నిధిని బాధితులకు అందజేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జుల ద్వారా పంపే దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలించి ఆ మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పేదప్రజల ఆరోగ్యం కోసం నిధులను మంజూరుచేస్తోందని, ఇదెంతో అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యంతో పాటు, నెల్లూరు 4 వ డివిజన్ కార్పొరేటర్ మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

# ఆ కాలేజీలకు పూర్వ వైభవం తెస్తాం

### - మంత్రి నారాయణ



నెల్లూరులో గతంలో ఎంతో ఘనంగా వుండి, ఇప్పుడు వెనుకబడిపోయిన కాలేజీలకు పూర్వవైభవం తీసుకొస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అన్నారు. సోమవారం ఆయన నెల్లూరు విఆర్ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించి, ఈ ప్రాంగణంలో త్వరలో కార్పొరేషన్ జూనియర్ కళాశాలను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో విఆర్‌సిలో ఒకప్పుడు సీటు దొరకాలంటేనే ఎంతో కష్టంగా వుండేదని, ఆ తర్వాత మారిన విద్యావిధానానికి అనుగుణంగా లేకపోవడం వల్ల వెనుకబడ్డామని అన్నారు. నగరంలోని విఆర్‌సి, సర్వోదయ కాలేజీ, వేణుగోపాలస్వామి కాలేజీలకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నూనె మల్లికార్జునయాదవ్, దాసరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు పౌష్టికాహారం



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో శిక్షణ పొందు తున్న 700 మంది క్రీడాకారులకు ఈ నెల 22వ తేదీ పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా నెల్లూరు మున్సిపల్ కమిషనర్ ఢిల్లీరావు పాల్గొని మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే జబ్బులకు దూరంగా ఉండొచ్చన్నారు. క్రీడా కారులకు డ్రస్సులు, ఆట వస్తువులు ఇస్తుంటారని, ఒక నెలరోజుల పాటు పౌష్టికాహారాన్ని ఇవ్వడం తాను ఏ జిల్లాలోనూ చూడలేదన్నారు. ఈ కార్యక్రమానికి దాతగా కార్పొరేటర్ మేకల రజని వ్యవహరించారు. వాకర్స్ అధ్యక్షకార్యదర్శులు వేలూరు రంగారావు, స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, డి.వై.సుబ్బరాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 డిప్యూటీ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, వీరిశెట్టి హజరత్‌బాబు, షణ్ముఖరాం, వేణుగోపాలరెడ్డి, ఎన్ఎల్‌వి ప్రసాద్ పాల్గొన్నారు.

# ముగ్గురు సిఐల బదిలీ

నెల్లూరుజిల్లాలో ముగ్గురు ఇన్స్‌పెక్టర్లను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి గుంటూరు రేంజ్ ఐజి సంజయ్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు నాల్గవ నగర సిఐ సీతారామయ్యను రేంజ్ విఆర్‌కు, నెల్లూరు సిసిఎస్ సిఐ సుధాకర్‌రెడ్డిని నెల్లూరు నాల్గవ నగర పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. రేంజ్ విఆర్‌లో వున్న వెంకట్రావును నెల్లూరు సిసిఎస్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే విధుల నుంచి రిలీవై తమకు కేటాయించిన ప్రాంతాల్లో రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఆదేశించారు.

### కాలధర్మం

# మదీనా ఇస్మాయిల్



నెల్లూరు నగరంలో గోడ గడియారమైనా, చేతి గడియారమైనా కొనాలంటే ముందుగా గుర్తొచ్చే పేరు మదీనా వాచ్ కంపెనీ! నెల్లూరీయుల మనసుల్లో మదీనా ఇస్మాయిల్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఆ కంపెనీ అధినేత షేక్ ఇస్మాయిల్ ఈ నెల 24వ తేదీ రాత్రి ప్రమాదవశాత్తూ మరణించారు. రాత్రి 10.30గంటల ప్రాంతంలో బాత్‌రూంకు వెళ్లిన ఆయన కళ్లు తిరిగి ట్యాప్‌పై పడడంతో తలకు బలమైన గాయం తగిలి స్పృహ కోల్పోయారు. కుటుంబసభ్యులు అది గుర్తించి ఆసుపత్రికి తీసుకెళ్లేసరికే ఆయన మరణించారు. ఆయన వయస్సు 71 సంవత్సరాలు. ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 1965లో నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద తొలి మదీనా వాచ్ కంపెనీని ప్రారంభించారు. ఆ తర్వాత తన శాఖలను నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తరించారు. సుమారు ఇరవైఐదేళ్ళ క్రితం సినిమా రంగంలోకి కూడా ప్రవేశించి 'ఆత్మ' అనే పేరుతో ఓ సినిమా తీసారు. అలాగే 'లవ్ గేమ్' అనే వీడియో చిత్రంలో హీరోగా నటించారు. ఇస్మాయిల్ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# ప్రకాశం పంతులుకు నివాళులు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలిముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమర యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు 60వ వర్ధంతి సందర్భంగా నెల్లూరు నగరం మద్రాసు బస్టాండు వద్దనున్న ప్రకాశం పంతులు విగ్రహానికి ఏపి బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెల్లంచేటి చంద్రమౌళి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ప్రకాశం పంతులు జయంతి, వర్ధంతులను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలుగా నిర్వహించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో సచివాలయ సముదాయానికి టంగుటూరి పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకాశం పంతులును భరతమాత ముద్దుబిడ్డగా భావించి భారతరత్న పురస్కారాన్ని ఇచ్చి గౌరవించాలని కోరారు.

# జడ్పీ వాకర్స్ దశ వసంతాల సంబరాలు

జిల్లా ప్రజావాకర్స్ సంఘం దశవసంతాల సంబరాలు ఇటీవల నెల్లూరులోని ఏపిహెచ్‌బి కాలనీలోని మున్సిపల్ పార్క్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా చెలంచర్ల భాస్కర్‌రెడ్డి వ్యవహరించారు. విశిష్ట అతిథిగా ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ముఖ్యఅతిథులుగా చెలికాని సీతారామయ్య, శ్యామల శ్రీనివాసరెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి, బి.మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆత్మీయ అతిథులుగా తుంగా నారాయణరెడ్డి, డా॥ బి.జయకుమార్, ఈతకోట సుబ్బారావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జోనల్ ఛైర్‌పర్సన్ మండవ శ్రీనివాసరావు పర్యవేక్షణలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దశవసంతాల ప్రత్యేక సంచిక ఆవిష్కరణను విఠపు బాలసుబ్రహ్మణ్యం గావించారు. ముఖ్య అతిథులు పుస్తక సమీక్ష చేశారు. ఆదర్శదంపతులు పి.సంపత్‌రెడ్డి, సునీతమ్మలను సత్కరించారు. ప్రముఖ రచయిత, కళాకారులు సిఆర్ రాఘవకు ఆత్మీయ పురస్కారం అందజేశారు. అనంతరం



హుష్‌కాకి నాటిక, అర్జున ఏకపాత్ర తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జెవిఎస్ఆర్ ఆంజనేయులు, ఎం.వి.కృష్ణయ్య, టి.వి.రమణయ్య, శ్రీధర్, సింధు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ నగర్‌లో రక్తదాన శిబిరం



యూత్ రెడ్‌క్రాస్ నెల్లూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌లో ఈనెల 22వతేదీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని విఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా॥ అశోక్‌రావు ప్రారంభించి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత ప్రతి సంవత్సరం రెండు పర్యాయాలు రక్తదానాన్ని చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకుని సమాజానికి తనవంతు సేవ చేయాలన్నారు. యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ డా॥ ఎన్.ప్రభాకర్ మాట్లాడుతూ రక్తదానం పట్ల ప్రజల్లో అపోహలు తొలగించి ప్రజలను చైతన్యపరచడంలో యువత ముందుండాలని కోరారు. బ్లడ్‌బ్యాంక్ మాజీకన్వీనర్ వాకాటి రవీంద్ర, రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు బత్తిన సాయికుమార్‌రెడ్డి, అంచూరు శ్రీనివాసులునాయుడు, డా॥ సురేంద్ర, సంపత్, మహేష్, చిన్నయ్య, వి.మోహన్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

# హోంగార్డులకు ఆర్థిక చేయూత



ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులు, మృతి చెందిన హోంగార్డుల కుటుంబాలకు సోమవారం నెల్లూరు అదనపు ఎస్పీ బి.శరత్‌బాబు ఆర్థికసాయం అందజేశారు. ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో హోంగార్డు డిఎస్పీ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పదవీవిరమణ చేసిన హోంగార్డులు కె.కోటేశ్వరమ్మ, సి.హెచ్.శ్యామల, కె.శ్రీనివాసమూర్తిలకు, మృతి చెందిన హోంగార్డులు ఎస్‌కె మహబూబ్ జాని, జి.సరస్వతి, కె.రవీంద్ర, కె.సతీష్, పి.సునీత, యం.శ్రీహరి, ఎస్‌కె అహమద్ బాషా, కె.సురేంద్ర, ఎ.నాగేశ్వరరావు, వి.కృష్ణల కుటుంబసభ్యులకు సాయం అందించారు. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న హోంగార్డులంతా కలిసి ఒకరోజు వేతనం రూ.3.16 లక్షలను ఎస్పీ శరత్‌బాబు ద్వారా వారికి అందజేశారు. హోంగార్డ్స్ ఆర్ఐ కెజెఎం చిరంజీవి, సీనియర్ సహాయకురాలు షేక్ ఖతీజాబీ, ఏఆర్ఎస్ఐ యండి రియాజ్, పిసి మల్లికార్జున, హోంగార్డుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రవిబాబు, హోంగార్డు రాష్ట్ర సంయుక్తకార్యదర్శి బత్తల రామారావు, బి.మురళి, పివిఎస్ నిరంజన్‌రెడ్డి, మహిళా హోంగార్డులు కుసుమకుమారి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యమేలుతున్న రాక్షసత్వం

(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ పాత ఫ్యాక్షన్ సంస్కృతి పురుడు పోసుకుంటోంది. మొన్న కర్నూలు జిల్లాలో పత్తికొండ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ చెరుకులపాడు నారాయణరెడ్డి దారుణ హత్యే దీనికి ఉదంతంగా నిలుస్తోంది. ఇది రాజకీయ ప్రత్యర్థులు చేసిన హత్యే! ఆ నియోజకవర్గంలో నారాయణరెడ్డి బలమైన నాయకుడు. ఆయన ఉంటే వచ్చే ఎన్నికల్లో అధికారపార్టీకి గెలుపు కష్టమనివెప్పే ఆయనను అడ్డు తొలగించారనే ఆరోపణలు రావడం తెలిసిందే! ఇక మొన్న ప్రకాశం జిల్లాలో కరణం బలరాం అనుచరులను గొట్టిపాటి వర్గీయులు దారికాచి చంపడం చూసాం. ఇవే కాదు, తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డ ఈ మూడేళ్లలో అన్ని జిల్లాల్లోనూ రాజకీయ హత్యలు, అరాచకాలు పెరిగాయి. ప్రతిపక్ష నేతలను మట్టుబెట్టే కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతుందన్నట్లుగా అరాచకాలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులే గూండాల్లాగా తయారవుతున్నారు. తాము చెప్పిన అడ్డగోలు పనులు చేయడం లేదని చెప్పి తెలుగుదేశం నాయకులు అధికారులపై దౌర్జన్యాలు చేయడం కూడా ఎక్కువైంది. విజయవాడలో అధికారపార్టీ ఎమ్మెల్యే దౌర్జన్యం వల్ల క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ చిన్నారి ఉన్న ఇల్లు అమ్ముకోలేక, వైద్యానికి డబ్బులు లేక మృత్యువాత పడడం చూసాం.

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు. పోలీసులకు ఆత్మాభిమానం లేనట్లుగా, వారిని పూర్తిగా పార్టీ కార్యకర్తల మాదిరిగా వాడుకుంటున్నారు. రాష్ట్రంలో అధికారపార్టీ వారికొక రూలు, ప్రతిపక్ష పార్టీ వారికొక రూలు అన్నట్లుగా పోలీసు చట్టాలు అమలవుతున్నాయి. అధికారులపై ఎంపీ, ఎమ్మెల్యేలు దౌర్జన్యం చేయడం, అధికారులను జుట్టుపట్టి ఈడ్చి కొట్టడం, ఎస్ఐలను నిర్బంధించడం, అధికారులను లెక్కలేనితనంతో మాట్లాడడం... ఇవన్నీ కూడా రాష్ట్రంలో గాడి తప్పిన పరిపాలనకు నిదర్శనం. ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతానని, దేశంలోనే మేటి రాజధానిని నిర్మిస్తానని చంద్రబాబు డప్పు కొట్టుకుంటున్నాడు. మొదట్నుండి అరాచకాలకు, కుల వైషమ్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా వున్న ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు ఈరోజు ఆ పోకడలకు దూరంగా, ఎంతో ప్రశాంతంగా ఉంటున్నాయి. మొదట్నుండి ప్రశాంతతకు మారుపేరైన ఆంధ్రప్రదేశ్ మాత్రం ఇప్పుడు కులరాజకీయ పోకడలతో, అరాచకాలు, అవినీతి అక్రమాలతో అశాంతప్రదేశ్‌గా మారిపోతోంది.

# బీజేపీలో అమితోత్సాహం!

(మొదటి పేజీ తరువాయి)

నాయకులు గ్రహించారు. రాష్ట్రంలో సొంతంగా ఎదుగుదాం, తెలుగుదేశంతో పొత్తు వద్దని 2014 ఎన్నికలప్పుడు రాష్ట్ర బీజేపీ నాయకులు నెత్తి నోరు బాదుకుని చెప్పినా కొందరు నాయకులు వినకుండా బలవంతపు పొత్తు కుదిర్చారు. దాని ఫలితంగానే చంద్రబాబుకు సీఎం కుర్చీ దక్కింది. అదే తప్పును తిరిగి పునరావృతం చేయకూడదనే భావన రాష్ట్ర బీజేపీ నాయకులలో కనిపిస్తోంది. అమిత్‌షాను కలిసిన రాష్ట్ర బీజేపీ నేతలు ఎక్కువమంది టీడీపీతో పొత్తు వద్దనే చెప్పారు. వారి ఆలోచనలకు తగ్గట్లే అమిత్‌షా రాష్ట్రంలో పార్టీని పటిష్టంచేసే దిశగా సంకేతాలిచ్చారు. విజయవాడ నుంచే బీజేపీ విజయం ప్రారంభం కావాలని బీజేపీ కార్యకర్తలకు ఆదేశాలిచ్చారు. దీనినిబట్టి భవిష్యత్ రాజకీయాలు ఎలా వుంటాయనే దానిపై సందిగ్ధత నెలకొంది. బీజేపీ నేతలు మాత్రం అమిత్‌షా వ్యాఖ్యలతో రాష్ట్రంలో సొంతంగా ఎదగాలనే ఉత్సాహం చూపుతున్నారు.

# హ్యాట్రిక్

(మొదటి పేజీ తరువాయి)

గత పదమూడేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి అధ్యక్ష పదవి కోసం పలువురు నాయకులు పోటీ పడ్డప్పటికీ, సీనియార్టీ దృష్ట్యా గాని, సామాజిక సమీకరణల కోణంలో గాని పార్టీ అధిష్టానం బీద రవిచంద్రనే అధ్యక్షుడిగా కొనసాగించడానికి నిర్ణయించింది. పార్టీకి పూర్తి విధేయుడు రవిచంద్ర. బి.సి వర్గాలలో పలుకుబడి, పరపతి వున్నోడు. జిల్లాలో నాయకులందరితోనూ సత్సంబంధాలు కలిగిన వ్యక్తి. 2004కు ముందు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా ప్రచారంలోకి వచ్చాడు. అయితే ఆ ఎన్నికల్లో ఆదాల కాంగ్రెస్‌లోకి వెళ్లినా, రవిచంద్ర మాత్రం తెలుగుదేశంలోనే ఉండిపోయాడు. 2004 నుండి 2014 వరకు పార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్లు కూడా పార్టీని వీడకుండా పార్టీ కోసం పనిచేసాడు. పార్టీ పట్ల అతను చూపిన విశ్వాసం, విధేయతే ఈరోజు ఆయనకు పార్టీలో పెద్దపీట వేసి గౌరవించింది.

ఇక రవిచంద్రను అధ్యక్షుడిగా కొనసాగించినట్లే పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శిగా చేజర్ల వెంకటేశ్వరరెడ్డిని కొనసాగించాలని నిర్ణయించారు. తెలుగుదేశం అనుబంధ సంఘాల విషయంలో కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. తెలుగు యువత జిల్లా అధ్యక్ష బాధ్యతలను ఆనం వివేకా కొడుకు, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డికి అప్పగించారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలిగా గత జడ్పీటీసీ ఎన్నికల్లో డి.వి.సత్రం నుండి వైకాపా అభ్యర్థిగా గెలిచి తెలుగుదేశంలో చేరిన ముప్పాళ్ల విజేతను నియమించారు. తెలుగు రైతు అధ్యక్షుడిగా ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన బొల్లినేని రామారావు (ఎమ్మెల్యే కాదు)ను, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నెల్లూరు, చింతారెడ్డిపాలెంకు చెందిన పెనేటి సునీల్‌కుమార్‌ను, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన మొహిద్దీన్‌ను, బిసి సెల్ అధ్యక్షుడిగా కోవూరు నియోజకవర్గానికి చెందిన పిఎల్ రావును, టిఎన్‌టియుసి అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన ఓబులనాయుడును ఎంపిక చేశారు. తెలుగునాడు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా కాకర్ల తిరుమలనాయుడునే కొనసాగించాలని నిర్ణయించారు.

# గాడిలో పడ్డ జగన్

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలను ధైర్యంగా ఎదుర్కోగలమనే నమ్మకంతో వున్నారు. ముఖ్యంగా ఢిల్లీ పరిణామాలు కూడా ఆ పార్టీలో ఉత్సాహవంతమైన వాతావరణాన్ని ఏర్పరచాయి. ఇంతకాలం చంద్రబాబుకే ఢిల్లీలో లాబీయింగ్ వుండేది. జగన్‌పై కాంగ్రెస్ కక్షకట్టి ఉండడం, మిగతా నాయకులతో సంబంధాలు లేకపోవడం జగన్‌కు లోటుగా అనిపించేది. విజయసాయిరెడ్డిని రాజ్యసభకు పంపించాక ఆ లోటు తీరింది. జగన్ తరపున ఢిల్లీలో లాబీయింగ్ చేయడంలో, ఏపిలో ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకుపోవడంలో విజయసాయిరెడ్డి సఫలమయ్యాడు. ఢిల్లీలో పట్టుదొరకడంతో రాష్ట్ర రాజకీయాల్లో జగన్ ఇక సరైన ట్రాక్‌లో పయనించబోతున్నాడు.

# నగరం రేస్‌లో జయ



నెల్లూరు నగరం తెలుగుదేశం అధ్యక్ష పదవిలో మార్పు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం నగర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని తిరిగి మొన్ననే నగర అధ్యక్షుడిగా ఎంపిక చేసారు. అయితే ఆయనకు త్వరలో 'సుడా' ఛైర్మెన్ పదవి రానుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నగర అధ్యక్ష పదవిలో కొత్త వారిని ఎంపిక చేయవచ్చు. దీంతో ఈ పదవికి పోటీ ఏర్పడింది. నగర అధ్యక్ష పదవిని వదులుకోవడం కోటంరెడ్డి శీనయ్యకు ఇష్టం లేనప్పటికీ, 'సుడా' కావాలంటే వదులుకోక తప్పదు. నగర అధ్యక్ష పదవికి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన అనుచరుడైన ఆనం జయకుమార్‌రెడ్డిని బలంగా ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది. మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి వర్గం నుండి ఈ పదవిని తీసుకోమని చెప్పినప్పటికి, ఇది తీసుకుంటే తనకు నామినేటెడ్ పదవి ఎగ్గొడతారనే భయంతో వారు నిరాకరించారు. దీంతో ఆనం జయకుమార్‌రెడ్డి పేరును ఆదాల తెర మీదకు తెచ్చారు. ఇంకోపక్క మంత్రి పి.నారాయణ అనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. అయితే పట్టాభి కంటే ఈ పదవికి జయకుమార్‌రెడ్డే సెట్ అవుతాడు. నగరంలో విస్తృత పరిచయాలున్న నాయకుడు జయకుమార్‌రెడ్డి. అన్ని పార్టీలలోని నాయకులతోనూ సత్సంబంధాలున్నాయి. ఆదాల గట్టిగా పట్టుబట్టి ఉన్నాడు కాబట్టి నగరాధ్యక్షుడిగా ఆయన ఎంపిక త్వరలోనే ఉండొచ్చు.

# తిరగబడ్డ తెలుగుబిడ్డ



***తెలుగుదేశం పార్టీలో ప్రజాస్వామ్యం విధానాలన్నారు... ప్రజాస్వామ్యం పద్ధతిలో పదవుల పందారం ఉంటుం దన్నారు... కష్టించినవారికే పదవుల న్నారు... మరి ఏవి ఆ పదవులు. ఎప్పుడూ పదవులు ఒక్కరికేనా? పని చేసేవాళ్లు ఎప్పుడూ బోయీలుగా ఉండి పోవాల్సిందేనా? వాళ్లను పల్లకినెక్కించే అవకాశం లేదా... అంటూ జిల్లా తెలుగు దేశంపార్టీలో ఓ గొంతు ప్రశ్నించింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికే ఈ ప్రశ్నలను సంధించింది. ఆ గొంతు పేరే పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి.***

కోవూరు నియోజకవర్గంలో ఒకప్పుడు పార్టీకి అండగా నిలిచిన నాయకుడు. జిల్లా అధ్యక్ష పదవి కోసం పోటీపడ్డాడు. చంద్రబాబు చెప్పే ఐవిఆర్‌ఎస్ విధానం ద్వారా కార్యకర్తల అభిప్రాయాలు తీసుకుని, అధ్యక్షుడిని ఎంపిక చేయాలని పట్టుబట్టారు. ఈమేరకు చంద్రబాబుకే లేఖ(వ్రాసి సంచలనం రేపాడు. అయితే ముందుగానే ఫిక్స్ అయిపోయిన పద్ధతి ప్రకారం జిల్లా అధ్యక్ష పదవి బీద రవి చంద్రనే వరించింది. ఆయన వ్రాసిన లేఖను పరిగణలోకి తీసుకున్న పార్టీ అధిష్టానం రవిచంద్రను అధ్యక్షుడిగా నియమించాక, ఆయన ఎంపికపై ఐవిఆర్‌ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ కోరింది.

ఎప్పుడూ లేని విధంగా పార్టీ అధ్యక్ష పదవి కోసం ఈసారి జిల్లాలో పోటీ నడిచింది. బీద రవిచంద్ర పార్టీ అధ్యక్షుడిగా వుండగా, ఈసారి అధ్యక్ష స్థానం కోసం కోవూరుకు చెందిన నాయకులు పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డితో పాటు మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు కూడా పోటీ పడ్డారు. ఈమేరకు పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి పార్టీ అధినేత చంద్రబాబుకు లెటర్ వ్రాసి సంచలనం సృష్టించాడు. పార్టీలో సమన్వయం లోపించిందని ఆయన ఆ లేఖలో ఎత్తి చూపారు. 2014 ఎన్నికల్లో కోవూరు తెలుగుదేశం సీటు కోసం ఆయన తీవ్రంగా ప్రయత్నించాడు. అంతకుముందు పార్టీకి నాయకత్వమే లేని స్థితిలో తాను ముందు కొచ్చి తన సొంత ఖర్చుతోనే ఇక్కడ పార్టీని నడిపించాడు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు అండగా నిలిచాడు. అయితే సీటు తనకే గ్యారంటీ అనుకున్న తరుణంలో కాంగ్రెస్ నుండి వచ్చిన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చివరి క్షణంలో సీటెత్తుకుని పోయాడు. దీంతో ఆయన తీవ్ర నిరుత్సాహానికి గురయ్యాడు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయనకు ఎటువంటి న్యాయం జరగలేదు. అడక్కుండా వుంటే ఎవరూ పట్టించు కోరనుకున్నాడో ఏమో, అధ్యక్ష పదవి కోసం పోటీలోకి దిగి చంద్రబాబుకే లేఖాస్త్రం సంధించాడు.

మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి 1999ఎన్నికలకు ముందు నుండే జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పని చేశాడు. పార్టీలో పదవులన్నీ డెల్టావాళ్లకేనా... మెట్ట ప్రాంతంలో పార్టీ అవసరం లేదా అంటూ ఆయన అధ్యక్ష స్థానాన్ని ఆశించాడు. పార్టీలో సీనియర్... అందరితో సత్సంబంధాలున్నవాడు. పూర్తిగా రాజకీయాలే వ్యాపకంగా ఉండేవాడు. ఆయన అధ్యక్ష పదవిని ఆశించడంలో అభ్యంతరం కూడా లేదు.

ఇక మరో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి కూడా అధ్యక్ష పదవిని ఆశించాడు. అయితే ఆయన రవిచంద్రను మార్చేపనైతేనే తనకు పదవి కావాలన్నాడు. ఇక్కడ అధ్యక్ష స్థానానికి ఈ ముగ్గురూ అర్హులే! కాకపోతే బీద రవిచంద్ర నాకొద్దు అని అనుకుని వుంటేనే వీళ్లల్లో ఒకరికి ఛాన్సుండేది!

# అభివృద్ధే తిరిగి అందలమెక్కిస్తుంది!

## - మహానాడులో దేశం నేతల విశ్వాసం



నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో బుధవారం ఉదయం తెలుగుదేశంపార్టీ మినీ మహానాడు కార్యక్రమం పార్టీ జెండా ఆవిష్కరణతో ప్రారంభమైంది. వేదిక మీద పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహానికి ముఖ్యనేతలు పూలమాలలు వేసి సభాకార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం ఒక్కొక్కరు తీర్మానాలు ప్రవేశపెడుతూ ఆమోదిస్తూ కార్యక్రమం కొనసాగింది. ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7.00 గంటల వరకు జరిగిన సమావేశంలో మొత్తం 25తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరుజిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అనుకూలమైన వాతావరణం వుందని, శ్రీసిటీలో 25వేల కోట్ల పెట్టుబడులతో 40వేల మందికి ప్రత్యక్షంగా, 60వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నాయన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి నీటిని కృష్ణానదికి మళ్లించి నదుల అనుసంధానం చేసిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందన్నారు. రైతు రుణమాఫీ విధానంపై ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడ అధ్యయనం చేయడం గర్వకారణమన్నారు. రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాజధాని రాష్ట్ర ప్రజల ఆర్థిక స్థితిగతులను తెలియజేస్తుందని, అందుకే చంద్రబాబు నాయుడు ప్రపంచంలోనే అద్భుతమైన రాజధాని నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. 58రోజుల్లో 33వేల ఎకరాల భూమిని సమీకరించగలిగామన్నారు. జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ టీడీపీని 2019లో మళ్లీ అధికారంలోకి తేవాల్సిన గురుతర బాధ్యత ఈసారి ఎన్నికైన గ్రామ, మండల, జిల్లా కమిటీలపై ఉందన్నారు. ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తాళ్ళపాక రమేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీధరకృష్ణారెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, పరసారత్నం, కంభం విజయరామిరెడ్డితో పాటు ఆనం రంగమయూర్‌రెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, మాజీ మున్సిపల్‌ఛైర్‌పర్సన్‌లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## తెలుగు మహిళలు తక్కువ



మినీ మహానాడు కార్యక్రమంలో మహిళల శాతం గణనీయంగా తగ్గింది. సభ్యుల్లో సైతం మహిళలు పెద్దగా కనిపించలేదు. మహిళా సాధికారతపై తీర్మానాన్ని ప్రవేశపెట్టే సమయంలో కూడా దీనిపై చర్చకు వచ్చింది. మహిళలు సంఖ్య పెద్దగా లేదని భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని మహిళా సాధికారతపై మాట్లాడిన మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ ప్రస్తావించారు.

## దుమ్మా కొట్టిన నేతలు

మినీమహానాడుకు మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, మాజీ ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, బీద మస్తాన్‌రావు, కోవూరు నాయకుడు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, ఆత్మకూరు నాయకుడు గూటూరు కన్నబాబు దుమ్మాకొట్టారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బొల్లినేని రామారావు అనారోగ్యం కారణంగా, బీద మస్తాన్‌రావు అమరావతిలో సమావేశం వల్ల రాలేదని జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర సమావేశంలో ప్రకటించారు.

# కనువిందుగా సింహపురి నృత్యోత్సవం



జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య కళాకారులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో పెన్నాతీరంలో సిరిమువ్వల సవ్వడి కనువిందు చేసింది. కేరళకు చెందిన సత్యాంజలి కూచిపూడి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నెల్లూరు టౌన్‌హాలులో అఖిలభారత శాస్త్రీయ నృత్యోత్సవం ప్రారంభమైంది. సత్యాంజలి వ్యవస్థాపకులు అనుపమ మోహన్ బృందం ప్రదర్శించిన పారిజాతాపహరణ నృత్య రూపకం ప్రేక్షకుల కరతాళధ్వనులు అందుకుంది. దుబాయ్‌కి చెందిన కళాకారిణి పవిత్ర శ్రీమేధ, కేరళకు చెందిన శ్యామ, మీనాక్షి, ముంబైకి చెందిన నృత్య కళాకారిణిల ప్రత్యేక నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలను శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్, నాట్యాచార్యులు అనుపమ మోహన్‌తో కలిసి జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. దేశవిదేశాలకు చెందిన నృత్య కళాకారిణిల ప్రదర్శనలు గురు, శుక్రవారాల్లో కూడా జరిగాయి. ఈ సందర్భంగా అనుపమ మోహన్ దంపతులను ఘనంగా సత్కరించారు. ముంబై నాట్యాచార్యులు కాశ్మీరీత్రివేదీకి "సింహపురి నాట్యశిరోమణి" పురస్కారం, అభినయ డ్యాన్స్ అకాడమీ నిర్వాహకురాలు విమలాకృష్ణకు "సింహపురి నాట్యరత్న" పురస్కారాలను ప్రదానం చేసారు. నలుబోలు బలరామయ్యనాయుడు, యం.వి.సుబ్బారెడ్డి, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com